# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక






అమలాపురం | సంపుటి : 10 సంచిక : 28 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 20 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amlapuram Vol:10 Issue : 28 20-03-2025 Edirtor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## బిల్‌గేట్స్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు

**బిల్ గేట్స్ తో సమావేశం అద్భుతంగా సాగింది: సీఎం చంద్రబాబు**

**ఏపీ అభివృద్ధిలో గేట్స్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తుందన్న చంద్రబాబు**

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు మరియు ప్రముఖ పారుపత్యవేత్త బిల్ గేట్స్‌ను రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారు. ఇటీవల బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌తో పలు ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ ఆహ్వానం వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. బిల్ గేట్స్ కూడా అమరావతి, తిరుపతి ప్రాంతాలను సందర్శించేందుకు అంగీకరించినట్లు సమాచారం.



**బిల్ గేట్స్ తో సమావేశం అద్భుతంగా సాగింది: సీఎం చంద్రబాబు**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ ఢిల్లీ పర్యటనలో భాగంగా టెక్ దిగ్గజం, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశం గురించి చంద్రబాబు ట్వీట్ చేశారు. బిల్ గేట్స్ తో సమావేశం అద్భుతంగా సాగిందని వెల్లడించారు. ఏపీ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ ఏ విధంగా భాగస్వామ్యం కావొచ్చనే అంశంపై ఫలప్రదమైన చర్చ జరిగిందని తెలిపారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి కల్పన తదితర కీలక రంగాల్లో సేవలను మెరుగుపర్చడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల వినియోగానికి ఉన్న అవకాశాలను చర్చించామని చంద్రబాబు

- తరువాయి 2లో..

## సునీతా విలియమ్స్... మీరు పట్టుదల అంటే ఏంటో చూపించారు: ప్రధాని మోదీ

- సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్షం నుంచి భూమిపైకి సునీత, బుచ్ విల్మోర్
- వ్యోమగాములను ప్రశంసిస్తూ ప్రధాని మోదీ ట్వీట్
- వారి జీవితం ఎంతో మందికి స్ఫూర్తి అని కొనియాడిన ప్రధాని




సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్ష కేంద్రం నుంచి భూమిపైకి తిరిగొచ్చిన సునీతా విలియమ్స్, ఇతర వ్యోమగాములను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. పట్టుదల అంటే ఏంటో చూపించారని, ఎంతో మందికి స్ఫూర్తి అంటూ వ్యోమగాములను కొనియాడుతూ ప్రధాని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్టు పెట్టారు. "తిరిగి స్వాగతం క్రూ9. మిమ్మల్ని భూమి చాలా మిస్ అయింది. సునీతా విలియమ్స్, క్రూ9 వ్యోమగాములు మరోసారి పట్టుదల అంటే ఏమిటో మనకు చూపించారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి ఎప్పటికీ స్ఫూర్తినిస్తుంది. అంతరిక్ష అన్వేషణ అంటే మానవ సామర్థ్యాన్ని మించి సరిహద్దుల్ని దాటుకుని వెళ్లడం, కలల్ని నిజం చేసుకునే ధైర్యాన్ని కలిగి ఉండటం. సునీత ఒక ఐకాన్. తన కెరీర్ అంతటా స్ఫూర్తిని ప్రదర్శించారు. వారిని సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారందరినీ చూసి మేము చాలా గర్వపడుతున్నాం. కచ్చితత్వం, అభిరుచి, సాంకేతికత, పట్టుదల కలిస్తే ఏం జరుగుతుందో వారు చూపించారు"అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.




## ఏపీ లో ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ ప్రభుత్వం హామీల అమలు పైన కసరత్తు చేస్తోంది. 2025-26 వార్షిక బడ్జెట్ లో తల్లికి వందనం తో పాటుగా అన్నదాత సుఖీభవ అమలు కోసం నిధులు కేటాయించింది. మే నెలలో తల్లికి వందనం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అన్నదాత

- తరువాయి 2లో..



## ఈనెల 25, 26 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఈ నెల 25, 26 తేదీల్లో కలెక్టర్ల సదస్సును నిర్వహించనుంది. సచివాలయంలో జరిగే ఈ సదస్సులో రాష్ట్ర పరిపాలనలోని కీలక అంశాలను సమీక్షించనున్నారు. ముఖ్యంగా, జిల్లాల స్థాయిలో ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించనున్నారు.

**గత నిర్ణయాల అమలు సమీక్ష**

ఈ సమావేశంలో, గతంలో

- తరువాయి 2లో..

**ఆంధ్రాలో లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్**

## అనుమతించే ఆలోచన!

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి దాదాపు ఏడాది పూర్తవుతోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పన్నులు, జీఎస్టీ ఆదాయం క్రమంగా తగ్గుతూ ఉండటం ప్రభుత్వాన్ని వేధిస్తోంది. గతంలో జగన్ సర్కార్ కంటే ప్రస్తుతం పన్నుల వసూళ్లు తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రజల వద్ద ఖర్చు చేసేందుకు డబ్బు లేకపోవటమే అనే వాదన కూడా వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏపీ సర్కార్ పన్ను ఆదాయాన్ని పెంచుకోవడానికి వివిధ అదనపు పన్నులు, సెస్‌ల ద్వారా రూ.13,100 కోట్ల వరకు ఆదాయం పొందే ప్రణాళికలను రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్‌ను అనుమతించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు ఈ అంశంపై ప్రభుత్వం తరఫు నుంచి ఎలాంటి ప్రకటన చేయలేదు. సీఎం చంద్రబాబు దీనిపై త్వరలోనే నిర్ణయం

- తరువాయి 2లో..



## టీచర్ల బదిలీల చట్టంతో చరిత్ర సృష్టించబోతున్నాం

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపాధ్యాయ బదిలీల క్రమబద్ధీకరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ బదిలీల చట్టం ఒక చారిత్రకమైన నిర్ణయమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన విమర్శించారు. నూతన చట్టంతో ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా పారదర్శక విధానాన్ని అమలు చేయబోతున్నామని తెలిపారు.

**వైసీపీ హయాంలో అవకతవకలు**

మునుపటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు పూర్తిగా అడ్డగోలుగా జరిగాయని లోకేశ్ ఆరోపించారు. విద్యా వ్యవస్థలో నైతికతను దెబ్బతీసే విధంగా బదిలీలు జరిగాయని, దీంతో ఉపాధ్యాయుల పనితీరుపై కూడా ప్రభావం చూపిందని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన

- తరువాయి 2లో..




## 9 నెలల నిరీక్షణకు తెర..

- వార్త 3లో..

**అమరావతి నిర్మాణానికి**

## రూ.31,600 కోట్లు : మంత్రి నారాయణ

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



శాసనమండలిలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ..రాజధాని అమరావతి నిర్మాణం కోసం రూ.31,600 కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ఖర్చు పెట్టే నిధులన్నింటినీ కేంద్ర ప్రభుత్వం సహా వివిధ బ్యాంకుల నుంచి రుణంగా తీసుకుంటున్నట్టు తెలిపారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఏషియన్ బ్యాంకు కలిపి రూ.15వేల కోట్లు ఇస్తున్నాయని, హడ్కో నుంచి రూ.15వేల కోట్లు ఇస్తున్నాయని, హడ్కో నుంచి రూ.15వేల కోట్లు, జర్మన్‌కు చెందిన బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ ద్వారా రూ.5వేల కోట్లు రుణం తీసుకుంటున్నట్టు తెలిపారు. అమరావతి నిర్మాణానికి రూ.31,600 కోట్లు

**ఖర్చు పెట్టిన నిధులు జమ చేస్తాం**

అమరావతికి రైల్వే ట్రాక్‌ను

- తరువాయి 2లో..




## విశాఖ స్టేడియం పేరు మార్పు!

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి పేర్ల మార్పు వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఏపీ కేబినెట్ భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవడం, ముఖ్యంగా జిల్లాలు, మున్సిపాలిటీలు, స్టేడియంల పేర్ల మార్పు రాజకీయ వర్గాల్లో పెద్ద దుమారం రేపుతోంది.

**వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పు**

ఇటీవల ఏపీ ప్రభుత్వం వైఎస్ఆర్ జిల్లా పేరు మార్చుతూ, దానిని 'వైఎస్ఆర్ కడప జిల్లా'గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది వైసీపీ శ్రేణులను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఈ నిర్ణయంతో వైఎస్ఆర్ అభిమానులు, వైసీపీ నాయకులు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.అదేవిధంగా, కృష్ణా జిల్లాలోని వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ పేరును 'తాడిగడప మున్సిపాలిటి'గా మార్చారు. ఈ మార్పును వైసీపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

**విశాఖపట్నం స్టేడియం పేరు మార్పు**

విశాఖపట్నంలోని వైఎస్ఆర్ ఏసీఏ %-% వీడీసీఏ స్టేడియం పేరు మార్చారంటూ వార్తలు వస్తున్నాయి. దీనిపై వైసీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. వైఎస్ఆర్ ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియం పేరును అధికారులు ఏసీఏ- వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంగా మార్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించిన ఫోటోల

- తరువాయి 2లో..

## సంపాదకీయం

# మానవ సంకల్ప విజయానికి ప్రతీక!

## ఐఎస్ఎస్‌లో బుచ్ విల్మోర్‌తో సునీతా విలియమ్స్

**సైన్స్ చరిత్రను తిరగేస్తే యాదృచ్ఛికంగా జరిగిన ఆవిష్కరణలు కోకొల్లలు కనిపిస్తాయి. ఎనిమిది రోజుల పర్యటన కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ తొమ్మిది నెలల సుదీర్ఘ కాలం అక్కడే గడపడమూ ఈ కోవకే చెందుతుంది. ఎందుకంటే... మనిషి యుగాలుగా ఆశిస్తున్న, ఆకాంక్షిస్తున్న గ్రహాంతరయానమనే స్వప్నాన్ని ఈ యాత్ర మరికొంత దగ్గర చేసింది మరి!**

సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు తిరిగి భూమిని చేరిన రోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది. అంత రిక్ష ప్రయోగాల్లో ఇదో చరిత్రాత్మక ఘట్టంగానే చూడాలి. బోయింగ్ కంపెనీ తయారు చేసిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో సాంకేతిక సమస్యలు రావడం, సకాలంలో వాటిని సరిదిద్దే అవకాశం లేకపోవడంతో ఈ ఇద్దరు వ్యోమగా ములు మునుపెవ్వరూ గడపనంత అత్యధిక సమయాన్ని ఐఎస్ఎస్‌లో గడపాల్సి వచ్చింది. భూమికి 408 కిలోమీటర్ల ఎత్తులో తిరుగుతూండే ఐఎస్ఎస్‌లో ఉండటం అంత ఆషా మాషీ వ్యవహారం కానేకాదు.

అతి తక్కువ గురుత్వాకర్షణ శక్తి ఉంటుందిక్కడ. దీనివల్ల శరీరంలోని ద్రవాలన్నీ ఉండాల్సిన చోట కాకుండా... శరీరం పైభాగంలోకి చేరుతూంటాయి. ఇరవై నాలుగు గంటలకు ఒకసారి సూర్యోదయ, సుర్యాస్తమయాలను చూసే మనిషి... ఐఎస్ఎస్‌లో వీటిని పదహారు సార్లు చూడాల్సి వస్తుంది. ఇది కాస్తా వ్యోమగాముల నిద్రపై ప్రభావం చూపుతుంది.

కంటినిండా కునుకు లేక... కుటుంబానికి దూరంగా... ఇరుకైన చిన్న గదిలో నెలలపాటు గడపడం ఎంత కష్టమో మనం ఊహించనైనా ఊహించ లేము. ఊపిరి తీసుకోవడం మొదలుకొని కాలకృత్యాలు తీర్చుకోవడం వరకూ ప్రతి ఒక్కటి మానసికంగానూ, భౌతికంగానూ సవాలే! ఇంతటి శ్రమకోర్చి మరీ వీరు భూమికి తిరిగి వస్తూండటమే ఈ అంతరిక్ష ప్రయో గాన్ని మిగిలిన వాటికంటే ప్రత్యేకమైందిగా మారుస్తోంది.

**తొమ్మిది నెలలు చేసిందేమిటి?**

గత ఏడాది జూన్‌లో సునీత, విల్మోర్‌లు ఇద్దరూ ఐఎస్ఎస్‌కు ప్రయాణమైనప్పుడు వారి వద్ద ఎనిమిది రోజు లకు సరిపడా ప్రణాళికలైతే సిద్ధంగానే ఉన్నాయి. ఏ ఏ ప్రయోగాలు చేపట్టాలి. ఐఎస్ఎస్ నిర్వహణ తాలూకూ పనులు ఏమిటి? అన్నది వీరికి తెలుసు. కానీ అనూహ్యంగా వారి తిరుగు ప్రయాణం నిరవధికంగా వాయిదా పడింది. దీంతో వారికి ఎదురైన సరికొత్త సవాలు అంతకాలం ఏం చేయాలి? అన్నది. నాసా పరిశోధకుల సలహా సూచనల మేరకు వీరు ఈ తొమ్మిది నెలల కాలంలో సుమారు 150 వరకూ పరిశోధనలు చేపట్టారు. జీవ వ్యవస్థలపై సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి ప్రభావం, అంతరిక్షంలో మొక్కల పెంపకం, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు అంతరిక్షంలో ఎలా ప్రవర్తిస్తాయి? అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే ప్రయత్నం చేశారు.

అంతేకాదు... భవిష్యత్తులో మనిషి సుదీర్ఘకాలం పాటు అంతరిక్ష ప్రయాణాలు చేపట్టాల్సి వస్తే... అంతరిక్ష నౌకల్లో అగ్ని ప్రమాదాల్లాంటివి జరక్కుండా ఉండేందుకు... మంటలు ఎలా వ్యాపిస్తాయి? అన్న విషయంపై పరిశోధనలు నిర్వహించారు కూడా! దీంతో పాటే గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉండటం వల్ల శరీరంలోని కండరాలకు జరిగే నష్టాన్ని నివారించేందుకు యూరో పియన్ ఎన్‌హాన్స్‌డ్ ఎక్స్‌ప్లోరేషన్ ఎక్సర్‌సైజ్ డివైజ్(ఈ4డీ)ని పరీక్షించారు.

ఈ పరికరం సైక్లింగ్, రోయింగ్‌లతోపాటు రెసిస్టెన్స్ ఎక్సర్‌సైజ్‌ల ద్వారా వ్యోమగాముల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. అలాగే గ్రహాంతర ప్రయాణాలకు కీలకమైన నీటి పునర్వినియోగం, ప్రత్యేకమైన సూక్ష్మజీవుల ద్వారా మనిషికి అవసరమైన పోషకాల ఉత్పత్తి వంటి అంశాలపై కూడా ప్రయోగాలు చేశారు.

సౌర కుటుంబం మొత్తమ్మీద మనిషి జీవించేందుకు జాబిల్లి తరువాత కొద్దోగొప్పో అనుకూలతలున్న గ్రహం అంగారకుడు. స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఇంకొన్నేళ్లలోనే మనిషిని అంగారకుడిపైకి చేరుస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఐఎస్ఎస్‌లో సునీతా, విల్మోర్‌లు గత తొమ్మిది నెలలుగా చేసిన ప్రయోగాలకు, పరిశోధనలకు ప్రాధాన్యం ఏర్పడుతోంది.

సుదీర్ఘకాలం పాటు అంతరిక్షంలో ఉండటం భౌతికంగా, మానసికంగా ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఈ తొమ్మిది నెలల ప్రయాణం తరువాత శాస్త్రవేత్తలకు కొంత స్పష్టత ఏర్పడి ఉంటుంది. దీని ఆధారంగా భవిష్యత్తులో అంగారక ప్రయాణం జరిగే అవకాశాలు లేకపోలేదు. గురుత్వాకర్షణ శక్తి తక్కువగా ఉన్న పరిస్థితుల్లో మన ఎముకలు పెళుసుబారుతాయి.

కండరాలు, దృష్టి బలహీనపడతాయి. అలాంటప్పుడు ఏ రకమైన వ్యాయామాల ద్వారా నష్టాన్ని పరిమితం చేయవచ్చునన్నది సునీత, విల్మోర్‌ల పరిశోధనల ద్వారా తెలిసింది. అంతరిక్షంలో ఉండే విపరీతమైన రేడియోధార్మికత నుంచి వ్యోమ గాములను రక్షించుకునేందుకు కూడా వీరి ప్రయోగాలు సాయపడతాయి.

**వ్యోమగాముల త్యాగాల గురుతులు...**

ఎట్టకేలకు సునీత, విల్మోర్‌లు భూమిని చేరనున్నార న్నది అందరికీ సంతోషం కలిగించే వార్తే. కాకపోతే ఆ ఇద్దరు వ్యోమగాములు ఇప్పటివరకూ ఉన్న సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి వాతావరణం నుంచి సాధారణ పరిస్థితులకు ఎలా అడ్జెస్ట్ అవుతారన్నది ఒక ప్రశ్న. ఇది మరోసారి వారి సహనాన్ని, దృఢ చిత్తాన్ని పరీక్షించనుంది. వ్యోమగాముల శ్రమ, వేదన లను గమనిస్తే మానవ కల్యాణం కోసం వారు ఇంత త్యాగం చేస్తున్నారా? అనిపించకమానదు.

సునీత, విల్మోర్‌లు ఇద్దరూ 300కుపైగా రోజులు అంతరిక్షంలో గడపడం ఒక రికార్డే. అయితే ఇది వారి వ్యక్తిగత మైంది కాదు. మానవ సంకల్పానికి లభించిన విజయమని చెప్పాలి. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా), స్పేస్%-%ఎక్స్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భాగస్వా ములైన సుమారు 15 దేశాల శాస్త్రవేత్తలు అందరి ఉమ్మడి విజయం. 'చందమామ రావే... జాబిల్లి రావే' అంటూ పాట లకే పరిమితమైన ఒక తరం మాదిరిగా కాకుండా... 'గ్రహ రాశులను అధిగమించి, ఘనతారల పథము నుంచి... గగ నాంతర రోదసిలో గంధర్వ గోళగతులు దాటి' అంటూ సాగే నవతరానికి స్ఫూర్తి కూడా!

# వైకాపాకు మరో షాక్..
# ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ రాజీనామా



**గుంటూరు, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

**వైకాపాకు మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి మర్రి రాజశేఖర్ రాజీనామా చేశారు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజును కలిసి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీగా మర్రి రాజశేఖర్ పదవీకాలం 2029 వరకూ ఉంది. త్వరలో ఆయన తెదేపాలో చేరనున్నట్లు సమాచారం. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్సీలు వైకాపాను వీడారు. వారిలో జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, బల్లి కల్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ ఉన్నారు.**

చిలకలూరిపేట వైకాపా ఇన్‌ఛార్జ్‌గా మాజీ మంత్రి విడదల రజనీని నియమించడంతో మర్రి రాజశేఖర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాజీనామా చేశారు. రాజశేఖర్ రాజీనామా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పలువురు వైకాపా నేతలు అసెంబ్లీ లాబీలో ఆయనతో మాట్లాడేందుకు యత్నించారు. రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోరారు. ఇప్పటికే తాను నిర్ణయం తీసుకున్నానని వైకాపా నేతలకు మర్రి రాజశేఖర్ తేల్చి చెప్పారు.

## బిల్గేట్స్‌ను ఏపీకి ఆహ్వానించిన సీఎం చంద్రబాబు





వివరించారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047 విజన్ ను సాకారం చేసేందుకు ఏపీ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని... ఈ లక్ష్యాన్ని సాధించడంలో, ఏపీ ప్రజల సాధికారతను పెంచడంలో గేట్స్ ఫౌండేషన్ తో భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తుందని విశ్వసిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురోగతి కోసం తమ సమయం, ఆలోచనలు, మద్దతు ఇస్తున్నందుకు బిల్ గేట్స్ కు ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

**1995 నుంచి బిల్ గేట్స్‌తో సంబంధం**

బిల్ గేట్స్‌తో 1995 నుండి తనకు మంచి సంబంధాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మైక్రోసాఫ్ట్ ను హైదరాబాదులో స్థాపించడానికి బిల్ గేట్స్ తో ఒప్పందం కుదుర్చుకోవడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. ఆ అనుభవాన్ని ఆయన ఈ సందర్భంగా పంచుకున్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

**కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ**

ఇప్పటికే ఢిల్లీలో పర్యటిస్తున్న చంద్రబాబు నాయుడు కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ సహకారం, ఆరోగ్య రంగంలో పెట్టుబడులు, కొత్త విధానాల అమలు గురించి ఈ భేటీలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కేంద్రంతో రాష్ట్ర సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు చంద్రబాబు ఈ సమావేశాన్ని ఉపయోగించుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

**విజయవాడకు సీఎం తిరుగు ప్రయాణం**

ఢిల్లీలో తన పర్యటన ముగించుకున్న అనంతరం సీఎం చంద్రబాబు విజయవాడకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన ఆహ్వానంతో బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆరోగ్య రంగాల్లో మరిన్ని పెట్టుబడులు రావచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది. బిల్ గేట్స్ పర్యటన ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఏపీ లో ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు

సుఖీభవ మూడు విడతల్లో చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇక, ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు పైన ప్రభుత్వం అధికారుల నుంచి నివేదిక కోరింది. క్షేత్ర స్థాయిలో కసరత్తు జరుగుతోంది. ఈ పథకం అమలు దిశగా కార్యాచరణ సిద్దం అవుతోంది. ఉచిత బస్సు కూటమి నేతలు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అమలు చేసేలా ఆరు కీలక హామీలను ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్లతో పాటుగా.. బడ్జెట్ లో మరో రెండు పథకాలకు నిధులు కేటాయించారు. ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పైన కసరత్తు చేస్తున్నారు. తాజాగా మండలిలో మంత్రి సంధ్యారాణి తాము ఇచ్చిన హామీ మేరకు మహిళలకు జిల్లాల పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని వెల్లడించారు.

**ముగ్గురు మంత్రులతో కమిటీ**

పథకం అమలు పై ఆ తరువాత పొరుగు రాష్ట్రాల్లో ఈ పథకం అమలు తీరు పైన అధ్యయనం కోసం ముగ్గురు మంత్రులతో కమిటీ నియమించారు. ఇప్పటికే మంత్రులు తెలంగాణ, కర్ణాటకలో పర్యటించి ఈ పథకం అమలును పరిశీలించారు. అధికారులు ఇచ్చిన నివేదికలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుందని, అదనంగా 2,000ల కొత్త బస్సులు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఆర్టీసీ పై భారం మహిళలకు ఉచిత ప్రయాణం అమలుతో ఆర్టీసీకి నెలకు రూ.250 నుంచి రూ.260 కోట్ల వరకు రాబడి కోల్పోనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ప్రతినెలా సర్దుబాటు చేయాల్సి ఉంటుందని తేల్చారు.

## ఈనెల 25, 26 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించనున్నారు. ప్రత్యేకంగా, పీ4 విధానంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ప్రభుత్వ సేవల మరింత మెరుగుదల కోసం కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వనున్నారు.

**వాట్సాప్ గవర్నెన్స్, పథకాల పంపిణీ**

నూతనంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థపై సమావేశంలో చర్చ జరగనుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం, వాటిని పరిష్కరించడం వంటి అంశాలను చర్చించనున్నారు. అదనంగా, అర్హులకు సంక్షేమ పథకాలను వేగంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎం ఆదేశించనున్నారు.

**రాష్ట్ర అభివృద్ధిపై దిశానిర్దేశం**

ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహించి, కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రభుత్వ పరిపాలన మరింత పారదర్శకంగా, సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవడం ఈ సమావేశం యొక్క ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. కలెక్టర్ల సూచనలు, ఫీడ్బ్యాక్ తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవచ్చు.

## ఆంధ్రాలో లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్ అనుమతించే ఆలోచన!

తీసుకునే అవకాశం ఉందని ఒక సీనియర్ అధికారి అందించిన సమాచారం ప్రకారం తెలుస్తోంది.

ఏపీలో ప్రస్తుతం లాటరీలపై నిషేధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే లాటరీలు, ఆన్‌లైన్ గేమింగ్‌లపై ప్రతిపాదిత పన్నుపై చట్టపరమైన అభిప్రాయం కూడా అవసరమని సదరు అధికారి పేర్కొన్నారు.

**కొత్త ఆదాయాల అన్వేషణ పనిలో..**

ఆమోదం పొందిన తర్వాత వినోద పన్ను పెంపు సినిమా థియేటర్లు, పార్కులు, ఇతర పర్యాటక ఆకర్షణలలో అధిక ఛార్జీలకు దారితీస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి, సూపర్ సిక్స్ పథకాల కింద ఎన్నికల ముందు వాగ్దానాలలో భాగంగా రాష్ట్రంలో అమలు చేయబడుతున్న మెగా సంక్షేమ పథకాలను కొనసాగించడానికి రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నందున, పన్ను ఆదాయం పెరగడం రాష్ట్ర ప్రభుత్వానికి చాలా కీలకంగా మారిపోయింది. కొత్త పన్ను ప్రతిపాదన ఆమోదించబడితే పన్ను ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలుస్తోంది.

## టీచర్ల బదిలీల చట్టంతో చరిత్ర సృష్టించబోతున్నాం

వెంటనే అన్ని వర్గాల వారితో చర్చించి, సమగ్రమైన బదిలీల చట్టాన్ని రూపొందించామని తెలిపారు.

**పారదర్శక విధానం అమలు**

ఈ కొత్త చట్టం ద్వారా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా పూర్తిగా పారదర్శకంగా ఉంచబడుతుందని లోకేశ్ ప్రకటించారు. ఇప్పుడు టెక్నాలజీ సహాయంతో అన్ని వివరాలను చేస్తామని తెలిపారు. ఒకే ఒక్క లెక్కతో ఉపాధ్యాయుల బదిలీల విధానం జరగాలని, ఇంతకు ముందు జరిగిన అవకతవకలకు ఇక నుంచి అవకాశం ఉండదని హామీ ఇచ్చారు.

%హాశీనెవంష్ట్ర% :ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై వాస్తవాలు ఇవి :లోకేశ్

**రాష్ట్ర విద్యా రంగానికి మేలు**

నూతన బదిలీల చట్టం అమలుతో రాష్ట్రంలో ఉపాధ్యాయ వ్యవస్థ మరింత సమర్థంగా మారుతుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని, వారి భవిష్యత్‌కు ఊతం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చట్టంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తోడ్పాటు కలుగుతుందని, దీని ద్వారా విద్యా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

## అమరావతి నిర్మాణానికి రూ.31,600 కోట్లు : మంత్రి నారాయణ

కేంద్ర ప్రభుత్వమే నిర్మాణం చేస్తుందని, ట్రాక్ ఏర్పాటుకు భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని తెలిపారు. అమరావతి సెల్ఫ్ అసిస్టెంట్ ప్రాజెక్టుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రజలు చెల్లించిన పన్నుల్లో పైసా కూడా అమరావతికి ఖర్చు చేయొద్దని సీఎం ఆదేశించినట్టు మంత్రి తెలిపారు. బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి రూ.6వేల కోట్లు కేటాయించారని విపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించగా.. కేంద్రం, బ్యాంకుల నుంచి నిధులు రాగానే తిరిగి రాష్ట్ర బడ్జెట్‌కు ఖర్చు పెట్టిన నిధులు జమ చేస్తామని మంత్రి తెలిపారు.

## విశాఖ స్టేడియం పేరు మార్పు!

ు నెట్టింట వైరల్ అవుతున్నాయి. విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పేరులో వైఎస్ఆర్ అనే పదం తొలగించి కేవలం ఏసీఏ %-% వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంగా మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. రాత్రికి రాత్రే డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంగా ఉన్న పేరును ఏసీఏ %-% వీడీసీఏ క్రికెట్ స్టేడియంగా మార్చారంటూ వైసీపీ ఆరోపిస్తోంది. వైజాగ్ ఫిలింనగర్ క్లబ్‌లోని లాన్‌కు ఉన్న వైఎస్ఆర్ పేరును కూడా గతంలో తొలగించారని,మహా నేతపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తోంది. మరోవైపు గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో చాలా ప్రభుత్వ పథకాలకు పేర్లు మార్చారు. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును కూడా వైఎస్ఆర్ హెల్త్ వర్సిటీ మార్చిన సంగతి తెలిసిందే. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఎన్టీఆర్ పేరుతో జిల్లాను కూడా ఏర్పాటు చేశారు. అయితే ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్పుపై అప్పట్లో టీడీపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. అయితే 2024 ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే టీడీపీ కూటమి సర్కారు కూడా గత ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాల పేర్లను మార్చింది. సంఘ సంస్కర్తలు, స్వాతంత్రోద్యమ నాయకుల పేర్లతో నామకరణం చేసింది. అలాగే ఇటీవల వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పు, తాడిగడప మున్సిపాలిటీ పేరును మార్చుతూ నిర్ణయం తీసుకుంది.




# 9 నెలల నిరీక్షణకు తెర..

**భూమిని చేరుకున్న సునీత..**

**తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా సముద్ర తీరంలో ల్యాండైన డ్రాగన్ క్రూ**

**అప్పటికే అక్కడ బోట్లతో సిద్ధంగా ఉన్న నాసా సిబ్బంది**

**వ్యోమగాములను బయటకు తీసి జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలింపు**

**త్వరలో భారత్‌ను సందర్శించనున్న సునీతా విలియమ్స్!**

ఈవేళ న్యూస్ డెస్క్

తొమ్మిది నెలల నిరీక్షణకు తెరపడింది. భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ క్షేమంగా భూమిని చేరుకున్నారు. సునీత, బుచ్ విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి బయలుదేరిన క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఈ తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా సముద్ర తీరంలో ల్యాండైంది. గంటకు దాదాపు 27 వేల కిలోమీటర్ల వేగంతో భూమి వైపు దూసుకొచ్చిన డ్రాగన్ క్రూ క్యాప్సుల్ క్రమంగా వేగం తగ్గించుకుంటూ వచ్చింది. గంటకు 186 కిలోమీటర్ల వేగానికి చేరుకున్నాక దాని 4 పారాచూట్లు తెరుచుకున్నాయి. ఆ తర్వాత వేగాన్ని మరింత తగ్గించుకుని సుమద్ర జలాల్లో ల్యాండ్ అయింది. అప్పటికే అక్కడ బోట్లతో సిద్ధంగా ఉన్న నాసా సిబ్బంది క్యాప్సుల్‌ను ఓ బోటుపైకి ఎక్కించి ఒడ్డుకు చేర్చారు. అనంతరం లోపలున్న వ్యోమగాములను బయటకు తీసి హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వారు భూమి గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యే వరకు నిపుణుల పర్యవేక్షణలో ఉంటారు. కాగా, క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో విడిపోవడం దగ్గరి నుంచి వ్యోమగాములు భూమికి చేరడం వరకు ఈ మొత్తం కార్యక్రమాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది.

**అంతరిక్షంలో 286 రోజులు గడిపిన సునీతా విలియమ్స్**

భూమికి సుదూరంగా ఎక్కడో అంతరిక్ష కేంద్రంలో 286 రోజుల పాటు గడిపిన భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్.. క్షేమంగా తిరిగివచ్చారు. తోటి వ్యోమగామి బ్యారీ బుచ్ విల్మోర్‌తో కలిసి భూమండలానికి చేరుకున్నారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ల్యాండ్ అయ్యారు. ఫ్లోరిడాలో గల నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ చేరుకున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ తెల్లవారు జామున సరిగ్గా 3:27 నిమిషాలకు స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సుల్ క్రూ-9.. ఫ్లోరిడాలో గల నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి వారిద్దరినీ టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తీసుకెళ్లారు. 45 రోజుల పాటు అక్కడే రిహాబిలిటేషన్‌లో గడపనున్నారు. ఫ్లోరిడా తీరంలో స్పేస్ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ నేరుగా సముద్రంలో దిగింది. లక్షలాది మంది నాసా యూట్యూబ్ లైవ్ స్ట్రీమింగ్ ద్వారా దీన్ని వీక్షించారు. భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించిన కొద్ది నిమిషాలకే ఈస్టర్న్ టైమ్ జోన్ ప్రకారం..సాయంత్రం 5:57 నిమిషాలకు క్యాప్సూల్ సురక్షితంగా నీటిలో దిగింది. ఆ వెంటనే నాసా కంట్రోల్ రూమ్‌లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి.



**ఈ క్యాప్సూల్‌లో వున్నవారు సునీత విలియమ్స్, బ్యారి విల్మోర్..**



అమెరికన్ వ్యోమగామి సునీత విలియమ్స్, బ్యారి విల్మోర్‌తో పాటు నిక్ హేగ్, రష్యన్ వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ ఈ క్యాప్సూల్‌లో ఉన్నారు. ఈ క్యాప్సుల్ భూ కక్ష్యలోకి ప్రవేశించే సమయంలో కొద్దిసేపు కమ్యూనికేషన్ బ్లాక్ అవుట్ ఏర్పడింది. నాసా దాన్ని క్షణాల్లోనే పునరుద్ధరించగలిగింది. తొలుత నిగ్ హేగ్ నాసాను ఉద్దేశించి మాట్లాడారు. ఇదొక అద్భుత ప్రయాణంగా అభివర్ణించారు. దాదాపుగా 2,000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఈ డ్రాగన్ క్యాప్సుల్ భూ కక్ష్యలోకి ప్రవేశించింది. సముద్ర జలాల్లోకి క్యాప్సుల్ దిగిన వెంటనే నాసాకు చెందిన రికవరీ టీమ్ అలర్ట్ అయింది. వారిని అందులో నుంచి సురక్షితంగా బయటికి తీసుకొచ్చింది.

**త్వరలో భారత్‌ను సందర్శించనున్న సునీతా విలియమ్స్!**

తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో గడిపిన భారత సంతతికి చెందిన ప్రఖ్యాత వ్యోమగామి సునీతా విలియమ్స్ ఎట్టకేలకు భూమికి చేరుకున్నారు. ఆమెతో పాటు మరో ముగ్గురితో కలిసి స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ క్యాప్సూల్ బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా సముద్ర తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రపంచం ఉత్కంఠతో వీరి రాకను వీక్షించింది సునీతా విలియమ్స్ సహా మొత్తం నాలుగు మంది వ్యోమగాములు క్షేమంగా భూమికి తిరిగి రావడంతో అంతర్జాతీయ స్థాయిలో దీని గురించి ఆసక్తిగా చర్చ జరిగింది. అంతరిక్ష ప్రయాణం తర్వాత వారు సురక్షితంగా భూమికి చేరుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**భారత్‌లో సంబరాలు**

పూర్వీకుల గ్రామంలో ఆనందోత్సవాలు. సునీత సురక్షితంగా భూమికి చేరుకున్న సందర్భంగా గుజరాత్‌లోని ఝూలాసన్ గ్రామం సంబరాల్లో మునిగిపోయింది. గ్రామస్థులు బాణాసంచా కాల్చి, నృత్యాలు చేస్తూ సంబరాలు జరిపారు. ఆమె బంధువు ఫాల్గుణి పాండ్య గ్రామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**"సునీత కోసం 9 నెలలుగా ఎదురుచూశాం.**

**భారత పర్యటనపై కుటుంబ సభ్యుల ఆనందం**


సునీత త్వరలోనే భారత్‌కి రానున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు వెల్లడించారు. "ఇప్పుడు సునీత పూర్తిగా కుటుంబ సమయాన్ని ఆస్వాదించనుంది. త్వరలోనే ఆమె భారత్‌కి వస్తున్నారని మాకు తెలియజేశారు. మేమంతా కలిసి వేకేషన్ ప్లాన్ చేస్తున్నాం" అని ఫాల్గుణి పాండ్య తెలిపారు. ప్రధాని మోదీ ఆహ్వానం భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా సునీతా విలియమ్స్‌ను భారత్‌కు ఆహ్వానించారు. మోదీ సునీతకు ప్రత్యేకంగా ఓ లేఖ రాశారు. "మీరు భూమికి తిరిగి వచ్చిన తర్వాత మీరు భారత్‌కు రావాలని ఆశిస్తున్నాం. మా కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం భారతదేశానికి గర్వకారణం" అని లేఖలో పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ భారత పర్యటనలో గుజరాత్‌లోని ఝూలాసన్ గ్రామాన్ని సందర్శించే అవకాశం ఉంది.

# ఎవ్వరినీ వదలని పవన్ కల్యాణ్.. ట్వీట్ వైరల్

**ఘనంగా జనసేన 12వ ఆవిర్భావ సభ.. దిగ్విజయం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు..**

అమరావతి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ప్రశ్నిస్తానంటూ జనసేన పార్టీ పెట్టారు పవర్ స్టార్ పవన్ కల్యాణ్.. ఆ పార్టీ పెట్టి 11 ఏళ్లు పూర్తి చేసుకుని ఈ మధ్యే 12వ ఆవిర్భావ సభ ఘనంగా నిర్వహించారు.. తనకు ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించిన పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించి.. కీలక అంశాలను ప్రస్తావించారు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పార్టీ పెట్టిన నాటి నుంచి.. ఇవాళ అధికారంలో కీలక భాగస్వామిగా మారిన వరకు జరిగిన ప్రయాణాన్ని నెమరువేసుకున్నారు.. అయితే, ఈ సందర్భంగా శుభాకంక్షలు తెలిపిన వారితో పాటు.. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదులు తెలుపుతూ ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు పెట్టారు.. సీఎం చంద్రబాబు మొదలు కొని.. జనసేన కార్యకర్తల వరకు ఎవరినీ వదలకుండా ప్రత్యేక ధన్యవాదులు తెలిపిన పవన్ కల్యాణ్ ట్వీట్లు కాస్తా ఇప్పుడు వైరల్‌గా మారిపోయాయి.**



"జనసేన పార్టీ 11 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకుని, 12వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు పురంధేశ్వరికి, ఎన్డీఏ పక్ష నాయకులకు, ఇతర నాయకులు, చిత్ర పరిశ్రమ మిత్రులు, శ్రేయోభిలాషులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జనసేన పార్టీ రానున్న రోజుల్లో మరింత బలమైన పార్టీగా నిర్మాణం చేయడంతో పాటుగా, సామాన్యుల గొంతుకగా, రాష్ట్ర ప్రయోజనాలు, జాతీయ ఐక్యత లక్ష్యంగా మరింత బాధ్యతగా పనిచేసే దిశగా జనసేన పార్టీ అడుగులు వేయనుంది" అంటూ తొలి ట్వీట్ చేశారు పవన్ కల్యాణ్..

ఇక, "జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పిఠాపురం చిత్రాడలో నిర్వహించిన జయకేతనం బహిరంగ సభ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క జనసేన పార్టీ నాయకులకు, జన సైనికులకు, వీరమహిళలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. జనసేన పార్టీ 11 సంవత్సరాల ప్రస్థానం పూర్తి చేసుకుని 12 వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవడంలో అనేకమంది వేదిక మీద లేకపోయినా సరే ఎంతో కష్టపడ్డారు, సభ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. వారికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేయాల్సిన బాధ్యత నాపై ఉంది. ముందుగా ఈ వేడుకను ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించుకునేందుకు, అన్ని విధాలుగా సహకరించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసిన పోలీస్ శాఖకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, క్షేత్రస్థాయిలో పనిచేసిన ప్రతి ఒక్క పోలీస్ అధికారికి, బందోబస్తులో కీలక పాత్ర పోషించిన నా కానిస్టేబుల్ సోదరులకు కృతజ్ఞతలు. అలాగే సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్‌కి పార్టీ తరపున ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అవసరమైన వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, జయకేతనం సభ విజయవంతం అయ్యేందుకు క్షేత్రస్థాయిలో పనిచేసిన మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నాయకులు హరిప్రసాద్ గారికి, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కి, పిఠాపురం ఇంచార్జి మర్రెడ్డి శ్రీనివాస్, శాసన సభ్యులకు, పార్లమెంట్ సభ్యులకు, వివిధ జిల్లాల నాయకులకు, నా హృదయపూర్వక ధన్యవాదాలు" తెలుపుతూ మరో ట్వీట్ చేశారు..

ఆ ట్వీట్‌కు కొనసాగిస్తూ.. "అలాగే కార్యక్రమం ఏర్పాట్లను పూర్తిస్థాయిలో పరిశీలించి, సభాస్థలం ఎంపిక నుంచి, సభ పూర్తయ్యే వరకు అడుగడుగునా అన్ని విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, ఏ విధమైన అసౌకర్యం జరగకుండా నిర్వహించిన జనసేన పార్టీ ప్రోగ్రామ్స్ కమిటీ చైర్మన్ శివ శ్రీనివాస్‌రావు, వారి కమిటీ సభ్యులకు నా ధన్యవాదాలు. సభకు హాజరైన జనసేన శ్రేణులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు బృందాన్ని సిద్ధం చేసి, వైద్య సేవలు అందించిన డాక్టర్ సెల్ బృందానికి, సభ ప్రాంగణంలో సేవలు అందించిన వాలంటీర్ సోదరులకు ధన్యవాదాలు. ఈ కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా వీక్షించేందుకు, కార్యక్రమ సారాంశాన్ని చేరవేసేందుకు అన్ని విధాలుగా సహకరించిన మీడియా మిత్రులకు, పాత్రికేయులకు, లైవ్ కవరేజ్ అందించిన సిబ్బందికి ధన్యవాదాలు. జనసేన పార్టీ 11 ఏళ్ల ప్రయాణాన్ని వివరిస్తూ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను, వివరిస్తూ వివిధ డాక్యుమెంటరీలో రూపొందించి వాటిని ప్రజలకు తెలిసేలా ప్రదర్శించిన జనసేన పార్టీ సోషల్ మీడియా విభాగం %జీూూాష్ట్రఘ్ముస్త్రఅఱుముఎ%కి ధన్యవాదాలు. వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమ ప్రదర్శనలు నిర్వహించి జనసేన పార్టీ సంస్కృతులను కాపాడే విధానం తెలియజేసేందుకు కృషి చేసిన సాంస్కృతిక విభాగం కమిటీకి, హరీష్ పాయి, కళాకారులను మనస్ఫూర్తిగా అభినందిస్తునలు తెలియజేస్తున్నాను.".. ఇక, "తీవ్రమైన ఎండ ఉన్నప్పటికీ, కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి డిహైడ్రేషన్ అవ్వకుండా వారికి దారి పొడవునా ఫుడ్ స్టాల్స్ ఏర్పాటుచేసి పండ్లు, మజ్జిగ, నీరు, ఆహారం అందించిన ఫుడ్ కమిటీ విభాగానికి, స్టేజ్ డెకరేషన్, లైటింగ్, సౌండింగ్ బృందానికి, ప్రతీ ఒక్క కార్మికుడికి, కార్యక్రమం అనంతరం ప్రాంగణాన్ని పరిశుభ్రం చేసి, స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ప్రతీ ఒక్కరినీ అభినందిస్తున్నాను. సభకు స్థలాన్ని అందించిన దాతలకు, సభా వేదిక వద్ద పారిశుధ్య సేవలు అందించిన పారిశుధ్య సిబ్బందికి, వారిని సత్కరించిన ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబుకి ధన్యవాదాలు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహాయ, సహకారాలు అందించిన జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బందికి, నా వ్యక్తిగత భద్రత సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, రానున్న రోజుల్లో జనసేన పార్టీ బలోపేతం కోసం నూతన ఉత్సాహంతో, ప్రజల పక్షాన నిలబడి పనిచేయాల్సిందిగా జనసేన శ్రేణులకు పిలుపునిస్తున్నాను."అంటూ జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ పవన్ కల్యాణ్ తన ట్వీట్లలో పేర్కొన్నారు..

# న్యాయస్థానంలో ట్రంప్‌కు ఎదురుదెబ్బ..

## అధ్యక్షుడి ఆదేశాలు నిలిపివేత

**మిలటరీ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఉత్తర్వులు**

**ట్రంప్ ఆదేశాలను తప్పుబట్టిన న్యాయస్థానం**

**మానవులందరూ సమానమనే యూఎస్ స్వాతంత్ర్య ప్రకటనను గుర్తుచేసిన న్యాయస్థానం**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళల క్రీడా పోటీల్లో ట్రాన్స్‌జెండర్లు పాల్గొనడాన్ని నిషేధించారు. అలాగే, అమెరికా మిలటరీ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల నియామకాన్ని రద్దు చేశారు. ట్రంప్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలువురు ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. నిన్న జరిగిన విచారణలో ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. సమానత్వ సూత్రాన్ని ఉదహరిస్తూ ట్రాన్స్‌జెండర్లపై నిషేధాన్ని న్యాయస్థానం తిరస్కరించింది. రాజ్యాంగంలోని ట్రాన్స్‌జెండర్ల హక్కులను కాలరాసే అధికారం అధ్యక్షుడి ఉత్తర్వులకు ఉన్నప్పటికీ, అది సరికాదని స్పష్టం చేసింది. సృష్టిలోని మానవులందరూ సమానమనే అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను ఈ సందర్భంగా కోర్టు గుర్తు చేసింది. ట్రంప్ ఆదేశాలను నిలిపివేస్తున్నట్టు పేర్కొంది. మరోవైపు, టెస్లా, స్పేస్ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) మూసివేతపై దాఖలైన మరో పిటిషన్‌పైనా నిన్న విచారణ జరిగింది. యూఎస్ ఎయిడ్ మూసివేతను వెంటనే నిలిపివేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది.

# సునీతా విలియమ్స్‌కు ఏపీ అసెంబ్లీ అభినందనలు

**సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భూమికి చేరుకున్న సునీత, బుచ్ విల్మోర్**

**ఇద్దరు వ్యోమగాములకు అభినందనలు తెలిపిన ఏపీ అసెంబ్లీ**

**వ్యోమగాముల జీవితం మానవాళికి స్ఫూర్తిదాయకమన్న స్పీకర్**

**అంతరిక్ష రంగంలో సునీత ప్రదర్శించిన ధైర్య సాహసాలు, పరిశోధనలపై ప్రశంసలు**




తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అంతరిక్షం నుంచి భూమ్మీదకు చేరుకున్న భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లకు ఏపీ అసెంబ్లీ అభినందనలు తెలిపింది. ఇద్దరు వ్యోమగాములు పుడమికి సురక్షితంగా చేరుకోవడం ఆనందాయకమని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. వ్యోమగాముల జీవితం మానవాళికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. అంతరిక్ష రంగంలో సునీత ప్రదర్శించిన ధైర్య సాహసాలు, ఆమె పరిశోధనలు ప్రశంసనీయమన్నారు. కాగా, తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన సునీతతో పాటు మరో ముగ్గురితో భూమికి బయల్దేరిన స్పేస్ ఎక్స్ క్రూ డ్రాగన్ బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా సముద్ర తీరంలో సురక్షితంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 20 మార్చి 2025

## మాల సామాజిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు పై మాల జేఏసీ నిరసనలు





**మలికిపురం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంపై రాజోలు నియోజకవర్గం మలికిపురం,సఖినేటిపల్లి మండలాల్లో నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి.ఈ మేరకు మలికిపురం,సఖినేటిపల్లి మండలాల మాలల న్యాయపోరాట సమితి సభ్యులు నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ చింతా రాజబాబు ఆధ్వర్యంలో మలికిపురం,సఖినేటిపల్లి మండలాల తాసీల్దార్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 2011 సంవత్సర జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర క్యాబినేట్ ఎస్సీ వర్గీకరణ చేయ్యడంపై ఆమోదం తెలపడం అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు.తాజాగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి కులగణన చేపట్టి ఎస్సీలలో ఏ ఉపకులం ఎంత జనాభా ఉందో తేల్చిచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.మాల సామాజిక వర్గంపై కక్ష సాధింపు కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు తెలియచేసారు.అనంతరం మలికిపురం,సఖినేటిపల్లి మండలాల తాసీల్ధార్లకు పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్లు తోటే రాజేష్,తాడి సహదేవ్,జేఏసీ ముఖ్యనాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు,నల్లి శివకుమార్,గెడ్డం ఫిలిప్ రాజు,సరెళ్ళ విజయప్రసాద్,బళ్ళ నోబుల్,భూసి జాన్ మోజేష్,జిల్లెళ్ళ ఉదయ్,కుసుమ చింటు,పమ్మి రత్నంరాజు,బళ్ళ కిరణ్,మోకా శ్రీనుబాబు,రాపాక జాన్సన్,పెయ్యల చిట్టిబాబు,రాపాక లక్ష్మణ్,దొండపాటి యుగంధర్,చింతా శ్రీను,తాడి రవీంద్ర,చొప్పల టోనీ,నల్లి నరసింహమూర్తి,రమేష్,గొళ్ళ బాషా,శేఖర్,బందెల నవీన్,బళ్ళ శ్యాంబాబు,గంటా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## జయహెూ ...."సునీత విలియమ్స్ "

**కాట్రేనికోన మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



: అంతరిక్షంలో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, మొక్కవోని ధైర్యంతో, భగవద్గీతను తోడుగా చేసుకొని, ఆరు నూరైనా, అనుకున్న కార్యాన్ని పూర్తి చేసి, ప్రపంచానికి గొప్ప సందేశాన్నిచ్చిన వ్యోమగామి సునీతా విలియమ్స్ కు ధన్యవాదాలు తెలిపారు.ఇకపై మీరే మాకు ప్రేరణ అని,తల్లి కడుపులో బిడ్డ ఉండేది 280 రోజులు మాత్రమేనని సునీతా విలియమ్స్ అంతరిక్షంలో గడిపిన కాలం 287 రోజులు అంటే ఆవిడ 60 సంవత్సరాల వయస్సులో పునర్జన్మ ఎత్తినట్లేనని అంతరిక్షంలో నలుగురు వ్యోమగాములతో పాటు గత 9 నెలలు నుండి చిక్కుకుపోయి నేడు భూమి మీద క్షేమంగా దిగిన మన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ కి తన చిత్రం ద్వారా కాట్రేనికోన చెందిన అంజి అకొండి శుభాకాంక్షలు తెలిపారు. సునీతా విలియమ్స్ ఒక ఇంటర్వ్యూ లో చెప్పినట్టు తన కూడా అంతరిక్ష ప్రయాణంలో భగవద్గీత, వినాయక ప్రతిమ ఎప్పుడూ కూడా ఉంటాయని అన్నట్టు గా వాటిని చేతితో పట్టుకుని భూమి మీదకి దిగుతున్నట్టుగా నీటిరంగుల చిత్రం ద్వారా ఆయన అభినందనలు తెలిపారు.

## గోపాలరావు కుటుంబాన్ని పరామర్శించిన ఏవీఎస్ రాజు

**మలికిపురం మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఉల్లూరి గోపాలరావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవి సూర్యనారాయణ రాజు,మాజీ శాసనసభ్యులు మానేపల్లి అయ్యాజీ వేమా,జగడం సత్యనారాయణ,యడ్ల విష్ణుమూర్తి,అరిగెల సత్యనారాయణ పలువురు నేతలు గోపాలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీఎస్ రాజు మాట్లాడుతూ శంకరగుప్తం గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మొట్టమొదటి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులుగా ప్రజలు యొక్క మనలను పొందారని ఈ ప్రాంత ప్రజల హృదయాలలో ఆయన ప్రత్యేకమైన స్థానము సంపాదించుకున్నారని తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన తుది శ్వాస విడిచిన వరకు పార్టీకి అంకితభావంతో పని చేశారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## ఈ నెల 23 న రాజమహేంద్రవరంలో జాతీయ సాహిత్య సదస్సు

**సఖినేటిపల్లి మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



మహాకవి పద్మ భూషణ్ బోయి భీమన్న జీవితం–సాహిత్యంపై రాజమహేంద్రవరంలో ఈ నెల 23 న జాతీయ సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సి.ఈ. ఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీహాలు నందు ఆదివారం నాడు జరిగే సదస్సులో 100 మంది పత్ర సమర్పణ చేయనున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక సౌజన్యంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిధిగా బోయి భీమన్న సతీమణి బోయి హైమవతి హాజరవుతారన్నారు.సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపిక, శాలువా , ప్రశంసా పత్రంతో సత్కరించనున్నట్లు ప్రతాప్ తెలిపారు.సదస్సు కన్వీనర్ గా డాక్టర్ పార్ధసారధి వ్యవహరిస్తారన్నారు . యూనివర్శిటీ పరిశోధక విద్యార్థులు , సాహితీ వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు .

# రూ.2 కోట్లతో ఈదరపల్లి వద్ద కొత్త వంతెన నిర్మాణం

## - జిల్లా కేంద్రం అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్

**అమలాపురం, మార్చి 19(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




: అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే దిశగా ఈదరపల్లి వద్ద రూ.2 కోట్ల అంచనాతో నూతన వంతెన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదరపల్లి వంతెనకు ఇరువైపులా ప్రస్తుతం ఉన్న ఆక్రమణలను తొలగించడానికి కమిటీని ఏర్పాటు చేసామన్నారు. ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జటిలమవుతున్న నేపథ్యంలో కనీసం అంబులెన్స్ వెళ్లాలన్నా ఈ వంతెన వద్ద కష్టతరంగా మారిందన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ రద్దీ ఉండటంతో పట్టణ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి తక్షణమే కలెక్టరేట్ నుంఉ రూ. 2 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రగతికి నోచుకోని రహదారులు, కూడళ్లు, వంతెనల మూలంగా ట్రాఫిక్ సమస్య జటిలమవుతో%శ%దన్నారు. నూతనంగా ఏర్పాటైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ఉన్న పురాతనమైన వంతెనలు జిల్లా కేంద్రం స్థాయికి, ట్రాఫిక్ రద్దీకి తగ్గట్టుగా లేని దృష్ట్యా వీటిని విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఎన్నో ఏళ్లకాలం క్రితం బ్రిటిష్ వారు నిర్మించిన వంతెనల పైనే ప్రస్తుతం రాకపోకలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ సమస్య తీవ్రతరమైనదని తెలిపారు. అధిక సంఖ్యలో వాహనాల కారణంగా సమస్య ఉత్పన్నం అవుతుందని, వాహన కమ్యూనికేషన్లు, డేటా ట్రాన్స్ మిషను ఉపయోగించుకుని అనుకూల ట్రాఫిక్ సిగ్నల్ నియంత్రణ వ్యూహాల ద్వారా ఈ సమస్యలు పరిష్కరించడానికి దశల వారీగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్డిఓ కే.మాధవి, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము, జల వనరుల శాఖ డిఈ బి.శ్రీనివాసరావు, ట్రాన్స్ కో ఎస్ఈ ఎస్.రాజబాబు, మున్సిపల్ కమిషనర్ కె.వి.వి.ఆర్.రాజు తదితరులతో కమిటీ వేసామని, వీరు ఆక్రమణలను గుర్తించడంతో పాటు ఆక్రమిత స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు షాపులను తొలగించడానికి నివేదిక రూపొందించి తొలగింపు చర్యలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కే.కాశీ విశ్వేశ్వరరావు, వివిధ శాఖలకు చెందిన ఇంజనీర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం ఈవిఎం గోదాము వద్ద పటిష్ట భద్రత

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**ముమ్మిడివరం, మార్చి 19(తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ముమ్మిడివరంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోదాముకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసి, పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. బుధవారం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలోని మూడో అంతస్తులో ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరచిన గోదామును ఆయన తనిఖీ చేసారు. భద్రతా ఏర్పాట్లు, సీళ్ళు, తాళాలు పరిశీలించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా తాళాలు తీయించి లోపల భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వివి ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులతో కలిసి పరిశీలించారు తనిఖీల్లో భాగంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదాము సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు తదితరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ గోదామును మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలన్నారు. తనిఖీ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి బి.ఎల్.ఎన్.రాజకుమారి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వడ్డీ నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ తరఫున దొమ్మేటి రమణ కుమార్, సిపిఐ తరపున వి.విజయ్ కుమార్, తహసిల్దార్ సుబ్బలక్ష్మి ఉప తహసిల్దార్ శివరాజ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రామ్మోహన్, జూనియర్ అసిస్టెంట్ సాయిరాం, ఐటీ సపోర్టర్ బాబ్జి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కూనవరం మురుగు కాలువ డ్రెడ్జింగ్

# పనులు పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**ఉప్పలగుప్తం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



కూనవరం ప్రధాన మురుగు కాలువ డ్రెడ్జింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఉప్పలగుప్తం మండలం లోని కూనవరం ప్రధాన మురుగు కాలువలో రాఘవల తోట నుంచి గచ్చకాయలపొర వరకు జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులను జిల్లా కలెక్టర్ పడవలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెడ్జింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసి భవిష్యత్తులో పంట పొలాలకు ముంపు బెడద నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దెబ్బతిన్న మురుగు కాలువలు, పంట కాలువల గట్లను ఆయన పరిశీలించి గట్లు దిగువకు జారిపోకుండా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జియో టెక్స్ టైల్ మ్యాట్లను జియో సింథటిక్ పద్ధతిని వినియోగించే విధంగా ప్రతిపాదనలు చేయాలని డ్రైనేజీ విభాగ ఇంజనీర్లకు సూచించారు. పంట కాలువలు, మురుగు కాలువల గట్లు లూజ్ సాయిల్ మూలంగా దిగువకు జారిపోకుండా ఉండేందుకు వివిధ లేయర్లను శాస్త్ర సాంకేతికతను జోడించి పటిష్ట నిర్మాణం చేసేలా ఇకపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.వి.వి.కిషోర్, జూనియర్ ఇంజనీర్ సునీతా దేవి, తహసిల్దార్ వి.ఎస్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి

## త్రైమాసిక బ్యాంకర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ఏలూరు మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



వ్యవసాయ పరమైన ఏలూరు జిల్లాలో వ్యవసాయ రంగానికి ఇతోధికంగా రుణ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం త్రైమాసిక బ్యాంకర్ల సమావేశం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వ పథకాల లబ్దిదారులకు విరివిగా రుణాలు అందించి వారి పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంటసాగుచేస్తు సిసి ఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు తప్పనిసరిగా రుణాలు అందించాలని సూచించారు. జిల్లాలో 23,314 మంది సిసి ఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులకు ఇంతవరకు రూ. 142.85 కోట్లు అందించారని, ఇదే సమయంలో సిసి ఆర్సీ కార్డులు కలిగిన ప్రతి కౌలు రైతుకు రుణ పరపతి కల్పించాలని స్పష్టం చేశారు. కౌలు రైతులకు, మత్స్యకారులకు, పశుపోషణ నిమిత్తం చిన్నా, సన్నకారురైతులకు రుణాలు ఇచ్చి ఆర్థికంగా చేయూతనివ్వాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిశంబరు వరకు రూ.6,639 కోట్లు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు అందించారన్నారు. ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి రూ.15,778 కోట్లకు గాను ఇంతవరకు 13,277 కోట్లు(84.15) శాతం రుణాలు అందించారని, మార్చి చివరినాటికి నూరుశాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఆర్బిఐ నిబంధనలు ప్రకారం సిడి రేషియో ప్రమాణం కనీసం 60 శాతం ఉండాల్సివుండగా ఏలూరు జిల్లాలో ఇది 199 శాతంగా ఉండటం మంచి పరిణామమన్నారు. అనగా ప్రతి వందరూపాయల డిపాజిట్ కి సుమారు 199 రూపాయలు రుణం అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో వివిధ బ్యాంకులు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 90.63 కోట్లు విద్యారుణాలుగా, రూ.618.63 కోట్ల రూపాయులు హౌసింగ్ రుణాలుగా అందించారని వీటిని మరింత విస్తృతం చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీయోజన కింద అత్యధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తిస్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో ఇంతవరకు 1447 ధరఖాస్తులకు గాను ఇంతవరకు 715 మందికి రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు మంజూరు చేశారని, మరో 305 పరిశీలనలో ఉన్నాయన్నారు. వివిధ కారణాలతో తిరస్కరించిన 415 ధరఖాస్తులను పునఃపరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారుడు సొంతస్థలం చూపిస్తే కూడా మంజూరు చేయవచ్చనే నిబంధనను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. పిఎం స్వానిధి, పిఎం విశ్వకర్మ, పిఎం ఇజిపి, వంటి పథకాల్లో పెండింగ్ లో ఉన్న, తిరస్కరించబడిన ధరఖాస్తులను పునఃపరిశీలన చేసి రుణాలు మంజూరు కొరకు సంబంధిత లబ్దిదారులకు ఫోన్ కాల్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. ముద్ర రుణాలపై విస్తృతంగా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి బ్యాంకులో ఇందుకు సంబంధించిన సమాచారం తెలిపే పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. మత్స్యకారులకు హామీలేని విధంగా 2 లక్షల వరకు మర్కింగ్ క్యాపిటల్ కింద రుణ సౌకర్యం అందిస్తారనే విషయంపై మత్స్యశాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఆయా బ్యాంకులకు నిర్ధేశించిన లక్ష్యాలను కొన్ని బ్యాంకులు జిరో లక్ష్యాన్ని కనబరుస్తున్నాయని మార్చిలోపు అటువంటి బ్యాంకులు లక్ష్యాలు పూర్తిచేయకపోతే ఎస్ఎల్ బిసి దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు ఆయా బ్యాంకుల్లో ప్రభుత్వ డిపాజిట్లను వేయడం నిలుపుదల చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మండలస్థాయిలో జెఎంఎల్బిసి మీటింగులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం, ప్రభుత్వ నివేదికల సమర్పణకు అవసరమైన గణాంకాలను లీడ్ బ్యాంకుకు తప్పనిసరిగా బ్యాంకర్లు సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పోరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఓబిఎంఎంఎస్ స్వయంఉపాధి పథకాలకు బ్యాంకర్లు చేయూతనివ్వాలన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆర్బిఐ ఎల్ డిఓ పి. పూర్ణిమ మాట్లాడుతూ ఆర్బిఐ ప్రమాణాలకు అనుగుణంగా 2024-25 సంవత్సరానికి సంబంధించి మొత్తం రుణాల్లో వ్యవసాయానికి 18 శాతం, ప్రాధాన్యతా రంగాలకు 40 శాతం రుణాలు ఇవ్వవలసివుండగా ఏలూరు జిల్లాలో ఈ లక్ష్యాలకు మించి వ్యవసాయానికి 57.41 శాతం, ప్రాధాన్యతా రంగాలకు 72.07 శాతం రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఆర్బిఐ ఎల్ డిఓ పి. పూర్ణిమ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్. శ్రీనివాస్, ఎల్ డిఎం డి. నీలాద్రి, నాబార్డ్ డిడిఎం అనీల్ కాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, ఉధ్యానశాఖ డిడి ఎస్. రామ్మోహన్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, మత్స్యశాఖ జెడి నాగలింగాచార్యులు, బి.సి. కార్పోరేషన్ ఇడి ఎన్. పుష్పలత, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, వివిధ శాఖల అధికారులు, పలు బ్యాంకుల కంట్రోలర్లు, కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# మా బిల్లులు చెల్లించండి- మా ప్రాణాలను కాపాడండి

## ఏలూరు కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టర్ల నిరసన ర్యాలీ

ఏలూరు మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మా బిల్లులు చెల్లించండి మా ప్రాణాలు కాపాడండి అంటూ స్థానిక ఫైర్ స్టేషన్ నుండి కలెక్టరేట్ వరకు ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, వేలాది మంది మా కాంట్రాక్టర్లు 20 కి పైగా ఇంజనీరింగ్ విభాగాలలో వివిధ నిర్మాణ పనులలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. "స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర" అనే క్లీనర్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా బుధవారం సామూహిక శుభ్రపరిచే డ్రైవ్ ను ఏలూరు లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రత గురించి ప్రజలలో అవగాహన పెంచుతూనే, మా కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, ఆర్థిక ఇబ్బందులను సీఎం కి విన్నవించు అభ్యర్థిస్తున్నాము అని తెలియచేసారు. ఆరు సంవత్సరాలుగా మా బిల్స్ చెల్లింపుల్లో జాప్యం కారణంగా మా కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాడు, ఫలితంగా నిరర్ధక ఆస్తులు ( ఎన్ పి ఏలు), చెక్కులు బౌన్స్ కావడం మరియు వారి కుటుంబాలను పోషించుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల కన్స్ట్రక్షన్స్ అధినేత వి. సతీష్ చౌదరి మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి మరియు మా కొనిసాగుతున్న మరియు భవిష్యత్తు ప్రాజెక్టులపై దాని ప్రభావం కారణంగా, తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు మరియు కుటుంబ పోషించుకోవడంలో ఇబ్బందులు కారణంగా, మార్చి, 2025 నాటికి మా బకాయి బిల్లులకు అవసరమైన చెల్లింపులు అందకపోతే, మేము టెండర్లు వేయడం మరియు పనులను మరింతగా చేయలేని స్థితిలో ఉన్నాము, మేము మా భాగస్వామ్యాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తున్నాము మరియు మా బాధ్యతలను నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నాము అని అయితే, ప్రస్తుత పరిస్థితులు చెల్లింపులో మరింత జాప్యం మా కార్యకలాపాలను కొనసాగించే సామర్థ్యాన్ని దెబ్బతీసే స్థితిలో మమ్మల్ని వదిలివేసింది అని వాపోయారు . మా కొనసాగుతున్న ప్రాజెక్టుల ప్రాముఖ్యతను మేము అర్థం చేసుకున్నాము అని ఈ సవాలుతో కూడిన కాలంలో నావిగేట్ చేయడానికి మేము సాధ్యమైన ప్రతి అడుగు వేస్తున్నామని మీకు హామీ ఇస్తున్నాము అని తెలియచేసారు.






ఈ ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి, పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సి ఎఫ్ ఎం ఎస్ నిధి పోర్టల్ లోని సాంకేతిక అడ్డంకులను పరిష్కరించడంతో పాటు, ఏజ్ - వైస్ వారీగా ఫిఫో ప్రాతిపదికన బకాయిలు క్లియరెన్స్ కు ప్రాధాన్యత ఇవ్వాలని మేము సీఎం కి అభ్యర్థిస్తున్నాము అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల కన్స్ట్రక్షన్స్ అధినేత వి.సతీష్ చౌదరి, జనరల్ కౌన్సిల్ సభ్యులు కేపీ ప్రభాకర్, వైస్ చైర్మన్ బి. సోమేశ్వరరావు, కోశాధికారి కేవీపీ సూరిబాబు, సలహా సభ్యులు ఎంఎస్ఆర్ కృష్ణ, కెవిఎస్ బుచ్చిరాయుడు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విదేశీ ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడానికి కేంద్రం చర్యలు.

ఏలూరు మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




భారతదేశంలోని ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, టెలికాం, పవర్ వంటి వేగంగా విస్తరిస్తున్న రంగాల డిమాండ్ను తీర్చడానికి దిగుమతులపై ఆధారపడడం జరుగుతోందని, దేశీయ సరఫరాను పెంచి దిగుమతులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో పాటు 14 కీలక రంగాలలో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాల ద్వారా ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, వైట్ గూడ్స్, టెలికాం నెట్వర్కింగ్ ఉత్పత్తులు వంటివి ఉన్నాయని కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడించారు. చైనాలో తయారైన ఉత్పత్తుల దిగుమతిని తగ్గించేందుకు ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బుధవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సెమికండక్టర్, డిస్ప్లే తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి కోసం రూ. 76 వేల కోట్లు వ్యయంతో సెమికాన్ ఇండియా ప్రోగ్రామ్ ఆమోదించబడిందని, ప్రభుత్వం వివిధ రంగాలలో దిగుమతుల పెరుగుదలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటోందని, అదనంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రీమిడీస్ అక్రమ వాణిజ్య పద్ధతులపై చర్యలకు సిఫార్సు చేసే అధికారం కలిగి ఉందని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

**మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ.559.10 కోట్లు మంజూరు.**

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద మత్స్యకారులకు కల్పించిన ప్రయోజనాలపై లోక్ సభలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక మరియు పాల పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ బుధవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (%ూవీమీ%) ద్వారా ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 39 కార్యకలాపాలకు రూ.2398.72 కోట్ల అంచనా వ్యయంలో రూ.559.10 కోట్లు కేంద్ర భాగస్వామ్యంతో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి మంజూరు చేయగా, 2020-21 నుండి 2024-25 మధ్య కాలంలో విడుదల చేసిన రూ.482.55 కోట్లలో రూ.328.13 కోట్లు వినియోగించినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (%ూవీమీ%) ద్వారా గత నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్లో 3,09,771 మంది లబ్దిపొందారని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

**ఏపీలో 99.58 శాతం ప్రజలకు మొబైల్ సేవలు**

గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో నిర్మించిన, అప్గ్రేడ్ చేసిన, నిర్మాణంలో ఉన్న మొబైల్ టవర్ల వివరాలపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో ఏపీలో 28803 టవర్లు ఏర్పాటు చేయగా, ఏలూరు పార్లమెంట్ పరిధిలో 1128 టవర్లు అందుబాటులో ఉన్నాయని, మొబైల్ సెల్ టవర్ల నిర్మాణానికి రూ.642 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఏపీలో 99.58 శాతం మంది ప్రజలు మొబైల్ సేవలు వినియోగించుకుంటున్నట్లు కేంద్రమంత్రి బదులిచ్చారు.

# జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలి

ఏలూరు మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రత్యేక అధికారి పి . ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజన సభ స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జేసీ మరియు డిసిసిబి ప్రత్యేక అధికారి ధాత్రిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ సీజన్ సమయంలో పంట రుణాలు అందించాలని, రైతులు దరఖాస్తు చేసిన 20 రోజులలలోగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో వ్యాపార కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలన్నారు. డిసిసిబి వ్యాపార పరిధిని మరింత విస్తరించి, బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళల నుండి రుణాల రికవరీలు నూరుశాతం ఉన్నాయని, వారి స్వయం ఉపాధికి రుణాలను అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని జేసీ సూచించారు. నిరర్ధక రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రుణాల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. రుణాలను సక్రమంగా చెల్లించే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ర్యాంకింగ్ విధానాన్ని అమలు చేస్తామని, వారికి వడ్డీలో కొంత మొత్తం రాయితీపై రుణాలను అందిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన రాబడి, వ్యయాలను ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన బడ్జెట్ ప్రతిపాదనలను కూడా సభలో ఆమోదించారు. సమావేశంలో జిల్లా సహకార శాఖాధికారి ఏ . శ్రీనివాస్, డిసిసిబి సీఈఓ సింహాచలం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, సహకార శాఖ పర్సన్ ఇంచార్జ్ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్యాంక్ దోపిడి జరగకుండా పోలీసులు అడ్డుకట్ట

## నిందితుడు నుండి 02 పిస్టళ్లు, 17 బుల్లెట్లు స్వాధీనం



కాకినాడ మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కొడితే కుంభస్థలాన్ని కొట్టాలి ఒకేసారి జీవితంలో ఏదో ఒక దొంగతనం చేసి స్థిరపడిపోవాలనే దురాలోచనకు కాకినాడ పోలీసులు అడ్డుకట్ట వేశారు. బ్యాంక్ లేదా ఏటీఎంలను దోచేద్దాం అనుకున్న ఒక పాత నేరస్తుడిని కాకినాడ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి విషయాలను బుధవారం కాకినాడ జిల్లా పోలీసు అధికారి జి బిందు మాధవ్ సర్పవరం పోలీస్ స్టేషన్లో కేసుకు సంబంధించి విషయాలను విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విశాఖపట్నంకు చెందిన చిటికెల నాగేశ్వరరావు గతంలో చైతన్య గోదావరి బ్యాంక్లో ఉద్యోగం చేసేవాడని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేసేటప్పుడు ఆన్లైన్ బెట్టింగ్ ఇతర వ్యసనాలకు అలవాటుపడి సుమారు 900 గ్రాముల బంగారాన్ని వాడుకుని అధికార దుర్వినియోగం చేశాడని చెప్పారు. దాంతో అతని బ్యాంక్ అధికారులు సస్పెండ్ చేశారని చెప్పారు. ఈ క్రమంలో అతనికి ఉన్న చెడు వ్యసనాలు కారణంగా అతను గతంలో పనిచేసిన ఏలేశ్వరంలోని చైతన్య గోదావరి బ్యాంక్ ఎటిఎం నుండి దొంగతనంగా పాస్ కోడ్ ఉపయోగించి రెండు లక్షల 30వేల రూపాయలు దొంగతనంతో పాటు ఒక సారి మెడలో గొలుసు దొంగలించడం, నాలుగు సార్లు రాత్రి నేరాలు చేయడం, ఒక మోటార్ సైకిల్ దొంగతనం చేసినట్లు ఎస్పీ చెప్పారు. చిటికెల నాగేశ్వరరావుపై ఐదు ప్రాంతాల పోలీస్ స్టేషన్లో కేసులు నమోదైనట్లు చెప్పారు. ఒకేసారి జీవితంలో స్థిర పడిపోదామనే ఉద్దేశంతో యూట్యూబ్ ద్వారా తెలుసుకొని బీహార్లోని ముంగర్ ఏరియాకి వెళ్లి రెండు పిస్టళ్ళు (తుపాకులు), 17 బుల్లెట్లను కొనుగోలు చేశారన్నారు. ఈ క్రమంలో దోపిడీ చేసేందుకు ప్రయత్నం చేస్తూ విశాఖపట్నం సిటీ, రూరల్ ప్రాంతాలతో పాటు నర్సీపట్నం, ఆంధ్ర- తమిళనాడు బోర్డర్ల వద్ద రెక్కీలు నిర్వహించాడని చెప్పారు. ఈ క్రమంలో తమకు వచ్చిన సమాచారం మేరకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో అతనిని అరెస్టు చేసి నేరస్తుడి నుండి బీహార్లో కొనుగోలు చేసిన రెండు పిస్టళ్ళను,17 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో కాకినాడ ఎస్డిపిఓ మనీష్ దేవరాజ్ పాటిల్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డిఎస్ చైతన్యకృష్ణ, ఎస్సైలు మురళీమోహన్, రవీంద్రనాథ్ బాబు సిబ్బంది పాల్గొన్నారు..



జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

### ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ

# మాల సంఘాల ధర్నా




**భీమవరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసి ఆధ్వర్యంలో భీమవరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల నాయకులు కోనా జోసెఫ్, చికటిపల్లి మంగరాజు, గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కేబినెట్ లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఆ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మీసాల జైరాజ్, కేసి రాజు మాట్లాడుతూ మిశ్రా అన్ని జిల్లాలో తిరిగి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సంస్థలను రమ్మని పిలిచారని, ఈ రిపోర్ట్ నే ప్రభుత్వానికి ఇచ్చి తప్పుడు సంకేతాన్ని అందించారని వారు ఆరోపించారు. దీనిని నిరసిస్తూ 20న జిల్లా కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ధర్నాలో ఈది రవికుమార్, బేతాల కమలాకర్, గాతల సందీప్, గొల్ల రాజ్ కుమార్, అంబటి ఆనంద్ కుమార్, పట్టెం శుభకర్, కొండేటి లాజర్, బండి మధు తదితరులు పాల్గొన్నారు.

# 155 సెల్ ఫోన్స్ రికవరీ..

### జిల్లాల్లో 9 విడతల్లో 1,394 ఫోన్లు రికవరీ ..

### జిల్లా ఎస్పీ నయీం అస్మి



**భీమవరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భీమవరంలోని సెల్ ఫోన్ ట్రాకింగ్ టీం 9వ విడతలో భాగంగా 155 సెల్ ఫోన్ లను రికవరి చేసి బాధితులకు అందించామని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం బాధితులకు అందించారు. ఇప్పటి వరకు 4,334 పిర్యాదులు రాగా వాటిలో 9 విడతల్లో జిల్లాలో 1,394 ఫోన్లు రికవరీ చేయడం జరిగిందన్నారు. మొదటి విడత 157, రెండవ విడత 105, మూడవ విడత 180, నాల్గవ విడత 158, ఐదవ విడతలో 201, అరవ విడతలో 153, ఏడవ విడతలో 150, 8వ విడతలో 135, 9వ విడతలో 155 సెల్ ఫోన్ లను రికవరీ చేసి బాదితులకు అందచేయడం జరిగిందన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్ దొరికితే సొంతానికి వాడుకోకుండా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్ కి అందజేయాలని, బిల్లులు లేని సెల్ ఫోన్ లను కొనకూడదన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,394 ఫోన్లు రికవరీ చేయడం జరిగిందని, వాటి విలువ సుమారు రూ 2,09,10,000 లని, ఎవరైనా మిస్సింగ్ సెల్ గురించి సెల్ చాట్ బాక్స్ నెంబర్ 9154966503 కు" హై" అని మెసేజ్ చేసి వచ్చిన లింకును నింపి సబ్మిట్ చేసి తద్వారా ఫిర్యాదు చేయాలని అన్నారు.

# ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి

### దేవస్థానంలో హుండీ లెక్కింపు

### - రూ.9,21,301 ఆదాయం



**ఆత్రేయపురం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి దేవస్థానానికి రూ.9,21,301 హుండీ ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకట రమణమూర్తి తెలిపారు. బుధవారం స్వామి వారి సన్నిధిలో దేవాదాయ ధర్మదాయ శాఖ రాజమహేంద్రవరం తనిఖీదారు టి.వి.ఎస్.ఆర్. ప్రసాద్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కింపు ప్రారంభించారు.4 నెలల 21 రోజులకు గాను ప్రధాన హుండీల ద్వారా రూ. 7,11,464, అన్నదాన హుండీల ద్వారా రూ.2,09,837 వెరసి రూ.9,21,301 ఆదాయం వచ్చింది. అలాగే శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి వారి దేవస్థానంలో హుండీలు లెక్కింపు నిర్వహించగా 2 నెలల 11రోజులకు గాను రూ.1,27,525 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి వెంకట రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

### ఏలేశ్వరం సిద్ధనాధ్ జ్యువెలరీలో జరిగిన

# చోరీ కేసును చేధించిన పోలీసులు

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పి బిందు మాధవ్



**ఏలేశ్వరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత నెల 9వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,ఏలేశ్వరం ప్రధాన రహదారిలో సిద్ధనాద్ జ్యువెలరీ నందు జరిగిన చోరీని ప్రత్తిపాడు పోలీసులు చేధించారు.ఈ సందర్భంగా నిందితులను చోరీ సొత్తును మీడియా ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ మాట్లాడుతూ ఏలేశ్వరం ప్రధాన రహదారిలో ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి సిద్ధనాథ్ జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ ఘటనపై పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు ఆద్వర్యంలో ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ఎస్ అప్పారావు తమ సిబ్బందితో కేసును ఛేదించారని తెలిపారు. ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన కరణం కుమార్ ను %ూ%1 ముద్దాయిగా,కడప జిల్లా చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య ను %ూ%2గా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.వారి వద్ద నుండి ఒక పల్సర్ టూవీలర్ బైక్,11 కేజీలన్నర వెండి, 32.8 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని అన్నారు.%ూ% 1ముద్దాయి పై 30 దొంగతనం కేసులు ఉన్నాయని,%ూ%2 ముద్దాయిపై 11 ఎర్రచందనం కేసులతో పాటు 10 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు.నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు . సిద్ధనాద్ జ్యువెలరీ దొంగతనం కేసును చేధించిన సీఐ బి ఎస్ అప్పారావు,ఏలేశ్వరం ప్రత్తిపాడు,అన్నవరం రౌతులపూడి ఎస్సైలు ఎన్. రామలింగేశ్వరరావు,ఎస్ లక్ష్మికకాంతం,శ్రీహరి బాబు,జి. వెంకటేశ్వరరావులని తనతో పాటు,పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారని ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మీడియా కు తెలియచేసారు.

# నన్నయలో మెగా హెల్త్ క్యాంప్ కు విశేష స్పందన

**రాజమహేంద్రవరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ ను నిర్వహించారు. బుధవారం యూనివర్సిటీలోని డా.బి.ఆర్.సెంట్రల్ లైబ్రరీలో జరిగిన మెగా హెల్త్ క్యాంప్ ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరూ హెల్త్ క్యాంప్ కు హాజరయ్యారు. వివిధ హాస్పటల్స్ నుండి వచ్చిన వైద్య శిబిరాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతూ వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. తరువాత వీసీ కంటి పరీక్షలు చేయించుకున్నారు, విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య బృందానికి సూచించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈ మెగా హెల్త్ క్యాంప్ లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్, జి.ఎస్.ఎల్. హాస్పిటల్, శ్రీవాణి దంత వైద్యశాల, డాక్టర్ నీరజ డయాబెటిస్ నుండి వైద్య బృందం హాజరై వైద్య సేవలు, పరీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యం చక్కని ఆరోగ్యంతో ఉన్నప్పుడే విద్యను బాగా అభ్యసించగలమని, విశ్వవిద్యాలయంలో అందరికీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ మెగా హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేశామని, దీనికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో, పరీక్షలు సమయంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్స్ లో ఉండే విద్యార్థిని విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 2 వారిని వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.పి.వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ ా.ఎన్.రాజశేఖర్, ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.స్వరూప, ప్రభుత్వ ఆసుపత్రి చర్మ వ్యాధుల వైద్యులు డా.ఎం.హారిక, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, షరిల్ అహ్మద్, స్వాతిక, జి.ఎస్.ఎల్. హాస్పటల్ కంటి వైద్యులు డా.టి.వినిత, డా.లహరి, గైనిక్ వైద్యులు డా.సిహెచ్.లిల్లీ రాణి, శ్రీవాణి దంత వైద్యశాల డా.ఆర్.శ్రీవాణి, డాక్టర్ నీరజ డయాబెటిస్ డా.జె.నిరజా, యూనివర్సిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డా.ఎం.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే ధ్యేయంగా 7 శక్తి బృందాలు

### మహిళల్ని వేధించే వారి భరతం పట్టే 'శక్తి టీమ్స్'

### 'శక్తి యాప్" ప్రతి మహిళకు రక్షణక కవచం

### శక్తి టీం వాహనాలను ప్రారంభించిన ఎస్పీ నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జిల్లాలో మహిళల భద్రతకు పెద్దపీట వేశామని...మహిళల భద్రత కోసం నూతనంగా 7 శక్తి బృందాలు ఏర్పాటు చేసి రంగంలోకి దింపామని జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌ను బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆవరణలో జిల్లా ఎస్పీ పచ్చ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శక్తి 'మీ రక్షణ-మా ధ్యేయం' అనే నినాదంతో రూపొందించిన వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు సురక్షితంగా ఉన్న చోట సమాజం సురక్షితంగా ఉంటుంది అని అన్నారు. 24 గంటలు శక్తి టీమ్స్ విధి నిర్వహణలో ఉంటారన్నారు. బాలికలు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు సకాలంలో ఎలా స్పందించాలో, ఎంత సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలో శక్తి టీమ్స్‌కు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళును మఫ్టీలో నిఘా వేస్తారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/9493206006(వాట్సప్ నెంబర్) కాల్స్‌తో సంఘటన స్థలంకు ఈ టీమ్స్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంనకు చేరుకొని సమస్యలను చట్టబద్దంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా దిశానిర్ధేశం చేశారు. మహిళా చైతన్యం, స్వేచ్ఛ, భద్రత నినాదంతో శక్తి బృంద సభ్యులు పనిచేయాలని సూచించారు. మహిళలకు రక్షణగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించి, వారి మొబైల్ ఫోన్లలో ఇన్స్టాల్ చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. నగరంలో గంజా నివారణకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి నివారణ అనేది కేవలం పోలీసు వ్యవస్థతోనే సాధ్యం కాదని, ప్రజల నుండి కూడా సహకారం అవసరమన్నారు. గంజాయి సాగు, రవాణా సమాచారాన్ని అందించే వారికి ఇన్‌సెంటివ్స్ అందజేస్తామన్నారు. సమాజంలో అనేక నేరాలకు గంజాయి ఒక కారణం అవుతుందని, దీన్ని నిర్మూలించడానికి, యువతను దీనినుండి దూరం చేసేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బిఎం మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ(లా అండ్ ఆర్డర్) ఏవీ సుబ్బరాజు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఎల్ అర్జున్, డిఎస్‌పి(ఎస్‌బి) బి రామకృష్ణ , జోనల్ డిఎస్పీలు, ఇన్స్పెక్టర్(ఎస్‌బి) ఏ శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్(డిసిఆర్‌బి) పవన్ కుమార్ రెడ్డి, శక్తి టీం మహిళా పోలీసులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రాబోయే పుష్కరాలకు రుడా ద్వారా అభివృద్ధి

## రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి

**రాజమహేంద్రవరం, మార్చి 19 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

2027లో జరగనున్న పుష్కరాలకు ఇంటిగ్రేటెడ్ టూరిజం, ల్యాండ్ పూలింగ్ తదితర అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి రుడా అధికారులను ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో రూడా 6వ అదారిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భముగా మాట్లాడుతూ రాబోయే పుష్కరాలకు చేపట్టబడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధారిటీ మీటింగులో సమీక్షించారు. రుడా లోగో రీడిజైన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ద్వారా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ టూరిజం, రుడా పెరస్పెక్టివ్ ప్లాన్, మొదలగు అంశాలకు అధారిటీ అమోదం తెలిపింది. ఈ మీటింగ్‌లో రాబోయే పుష్కరాల దృష్ట్యా పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశానికి రుడా వైస్‌ఛైర్మన్ కేతన్ గర్గ్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించి పలు అంశాలను పూర్తిగా వివరించి, వివిధ శాఖల సహకారంతో రుడా చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు తెలుపుతూ, ఛైర్మన్ విజన్‌కు తోడుగా అందరి సహకారంతో రుడాను అభివృద్ధి పథంలో నిలుపుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌వో సీతా రామమూర్తి, రుడా సెక్రటరీ ఎమ్‌విఆర్ సాయిబాబా, సిటి ప్లానర్ జిఎస్‌విఎన్ మూర్తి, ఎస్‌ఇ ఆర్‌అడ్‌బి ఎస్‌పివి రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హుస్సేన్, రాజమహేంద్రవరం జిల్లా పంచాయతీ అధికారి ఆర్‌డిఎంఎ నాగ నర్సింహారావు, ఆర్‌డిడిటిపి ఎన్ శ్రీనివాస్ , కొవ్వూరు, నిడదవోలు, రామచంద్రపురం ఈ మూడు మ్యూనిసిపాలిటీల కమిషనర్లు, ఎస్‌ఇ ఎపిఇపిసిఎల్ తిలక్ కుమార్, రుడా ఈఈ నాగేశ్వరి, ఏవో పావని, రుడా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఐపీఎల్ 2025 ప్రారంభ వేడుకకు.. బాలీవుడ్ స్టార్లు


ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ మార్చి 22న ప్రారంభం కానుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభోత్సవ వేడుక జరగనుంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్ తారలు మెరవనున్నట్లు సమాచారం. బాలీవుడ్ నుంచి షారుఖ్ ఖాన్, సల్మాన్, విక్కీ కౌశల్, సంజయ్ దత్ వచ్చే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అరిజిత్ సింగ్, శ్రేయా ఘోషల్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నారు. శ్రద్ధా కపూర్, వరుణ్ ధావన్, దిశా పటానీ స్పెషల్ డ్యాన్స్ షో జరగనుంది. అంతేకాకుండా, పంజాబ్ స్టార్ ర్యాపర్ కరణ్ ఔజ్లా ప్రత్యేక షో చేయనున్నారు. అమెరికన్ పాప్ బ్యాండ్ వన్ రిపబ్లిక్ ప్రదర్శన కోసం ఆ బృందాన్ని సంప్రదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా.. మార్చి 22 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ అలరించనుంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజుల పాటు జరుగుతాయి. తొలి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్




ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్ వేదికగా ప్రారంభం కానుంది. మార్చి 23న ఉప్పల్ వేదికగా హైదరాబాద్ - రాజస్థాన్ జట్ల మధ్య పోరు ఉండనుంది. విశాఖలోని అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి రెండు మ్యాచ్‌లను కేటాయిస్తూ ఐపీఎల్ కమిటీ నిర్ణయం తీసుకుంది. మార్చి 24న ఢిల్లీ - లఖ్‌నవూ, మార్చి 30న ఢిల్లీ- హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

# ఈసారి ఐపీఎల్‌లో 300 స్కోరు చూస్తాం: ఏబీడీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు కొత్త సారథిగా వచ్చిన రజత్ పటీదార్‌కు మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ కీలక సూచనలు చేశాడు. అలాగే ఈ సారి ఐపీఎల్ సీజన్‌లో 300ం పరుగులు నమోదు కావడం ఖాయమని వ్యాఖ్యానించాడు. వరల్డ్ కప్‌ను నెగ్గడం కంటే ఐపీఎల్ విజేతగా నిలవడం సవాల్‌తో కూడుకున్నదేనని తెలిపాడు.



"రజత్ ముందున్న అతిపెద్ద సవాల్ ఫాఫ్ డుప్లెసిస్, విరాట్ కోహ్లీ అడుగుల్లో భయం లేకుండా ముందుకు సాగాలి. విరాట్ చుట్టే జట్టు తిరుగుతుందనడంలో సందేహం లేదు. అలాంటప్పుడు రజత్ ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి. 'నేను చేసేది కరెక్టేనా? అదే విరాట్ ఏం చేసేవాడు? అనే విషయాలను ఆలోచించడమే పెద్ద అవరోధంగా మారుతుంది. ఇలాంటి సవాల్‌ను అధిగమించాలంటే ఎప్పుడూ ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. 'నేను ఎందుకు ఈ పొజిషన్‌లో ఉన్నాను? నన్నెందుకు ఎంపిక చేశారు? అని ఆలోచించాలి. మంచి కారణం ఉంటేనే మేనేజ్‌మెంట్ అలా చేస్తుందని గ్రహించాలి. స్వతహాగా నిర్ణయాలు తీసుకోవాలి. సీనియర్ల నుంచి సలహాలు తీసుకోవడంలో తప్పులేదు" అని ఏబీడీ సూచించాడు.

### ఇంపాక్ట్ రూల్‌తో..

"ఐపీఎల్‌లో ఇంపాక్ట్ రూల్‌తో ఆట తీరు చాలా మారిపోయింది. దీని వల్ల టాప్ 3 బ్యాటర్లు ఎక్కువ రిస్క్ తీసుకొనేందుకు అవకాశం కలిగింది. అయితే, కొత్త ఇబ్బంది కరంగా మారుతుందని గతంలోనే చెప్పా. ఫీల్డింగ్ నిబంధనలు కూడా మారిస్తే బాగుంటుంది. సర్కిల్ ఆవల కేవలం ఇద్దరినే ఉంచడం వల్ల బౌలర్లకు కష్టంగా మారుతుంది. బ్యాటర్లకు స్వేచ్ఛ లభించినట్లే కానీ.. బౌలర్లకు శాపంగా మారుతుందనేది కొందరి అభిప్రాయం. అందుకే, ఈసారి ఐపీఎల్‌లో 300ం స్కోర్లను చూస్తామని అనుకుంటున్నా" అని డివిలియర్స్ వ్యాఖ్యానించాడు.

# అదొక్కటి చేయండి..

## ముంబయి ఫ్యాన్స్‌కు హార్దిక్ పాండ్య స్పెషల్ రిక్వెస్ట్

గతేడాది ఐపీఎల్ సందర్భంగా ముంబయి కెప్టెన్ హార్దిక్ పాండ్యపై తీవ్రస్థాయిలో హేళనలు వచ్చాయి. రోహిత్‌ను తప్పించి పాండ్యకు ముంబయి జట్టు పగ్గాలు అందించడంతో విమర్శలూ వినిపించాయి. టాస్ వేసేందుకు వెళ్లిన ప్రతి మ్యాచ్ సమయంలో ప్రేక్షకులు అరుస్తూ పాండ్యను ఎగతాళి చేసినట్లు ప్రవర్తించారు. ఆ తర్వాత జరిగిన టీ20 ప్రపంచకప్, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. దీంతో అతడిపై విమర్శలు చేసినవారే ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పుడు ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ ముంబయి కెప్టెన్‌గా హార్దిక్ కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముంబయి ఫ్యాన్స్‌కు హార్దిక్ స్పెషల్ రిక్వెస్ట్ చేశాడు.



"నేను జట్టులో ముఖ్యపాత్ర పోషించాలని అభిమానులు కోరుకోవడంలో తప్పులేదు. వారితో నేను అంగీకరిస్తున్నా. అయితే, నేను ఎప్పుడు బ్యాటింగ్ చేసినా ఉత్సాహపరచండి. సిక్స్ కొట్టినా.. టాస్‌కు వెళ్లినా అలానే చేయండి. ఇక్కడ నేను ఇతర రంగులను చూడటం లేదు. వాంఖడే స్టేడియంలో మన కలర్‌ను మాత్రమే చూస్తా. మీ నుంచి నేను ఆశించేది అదే. గత ఐపీఎల్ తర్వాత నుంచి ప్రయాణం చాలా అద్భుతంగా జరిగింది. కష్టాలు ఎదురైనప్పటికీ ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. నేనెప్పుడూ జట్టుకు ముఖ్యమైన ప్లేయర్‌గానే భావిస్తా. నా ఆల్‌రౌండ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తే అది జట్టుకే ప్రయోజనమని నిరంతరం ఆలోచిస్తా. ముంబయి జట్టుకు గొప్ప వారసత్వం ఉంది. మాపై అంచనాలూ భారీగానే ఉంటాయి. వాటిని నెరవేర్చడం ఎప్పుడూ సవాలే. అయితే కెప్టెన్‌గా సవాళ్లను ఎదుర్కోవడం నాకెంతో ఇష్టం. వాటిని ఆస్వాదిస్తా. సూర్యకుమార్‌యాదవ్ చాలా సంవత్సరాలుగా భారీగా పరుగులు చేస్తున్నాడు. అతడు దేశంతోపాటు ముంబయి ఇండియన్స్‌కు మ్యాచ్ విన్నర్. ఇక బ్యాటింగ్ ఆర్డర్‌లో నేను ముందుకురావడం గురించి ఎక్కువగా ఆలోచించను. మ్యాచ్ పరిస్థితిని బట్టి మారిపోతూ ఉంటాయి. రోహిత్‌తో కలిసి ఎవరు ఓపెనింగ్ చేస్తారనేది జట్టు అవసరాలను బట్టి నిర్ణయిస్తాం. జట్టులో ముగ్గురు కెప్టెన్లు ఉండటం నా అదృష్టం. రోహిత్, బుమ్రా, సూర్య నుంచి నాకు ఏ సాయం కావాలన్నా అందుతుంది" అని వెల్లడించాడు.

### తొలి మ్యాచ్‌కు సూర్యనే కెప్టెన్

గతేడాది ఐపీఎల్‌లో ముంబయి చివరి మ్యాచ్ సందర్భంగా ఓవర్‌రేట్ ఆలస్యం కారణంగా పాండ్యపై ఒక మ్యాచ్ నిషేధం పడింది. దీంతో ఈసారి తొలి మ్యాచ్‌కు అతడు దూరమవుతున్నాడు. పాండ్య స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టు పగ్గాలు చేపడతాడు. ఈ విషయంపై పాండ్య స్పందిస్తూ.. "సూర్యకుమార్ యాదవ్ భారత జట్టును అద్భుతంగా నడిపిస్తున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయి ఆడబోయే తొలి మ్యాచ్‌కు అతడే కెప్టెన్" అని పాండ్య తెలిపాడు. మార్చి 23న చెన్నై సూపర్ కింగ్స్‌తో ముంబయి తొలి మ్యాచ్ ఆడనుంది.

# విడాకుల వార్తలు.. ధనశ్రీకి రూ.4.75 కోట్లు భరణం ఇచ్చేందుకు చాహల్ అంగీకారం!




భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంపై తాజాగా కీలక సమాచారం ఒకటి బయటికొచ్చింది. చాహల్, ధన శ్రీ విడాకుల కోసం బాంబే హై కోర్టులో పిటిషన్ వేశారు. అయితే, 6 నెలల కూలింగ్ పీరియడ్‌ను బాంబే హైకోర్టు మినహాయించింది. ఈ విడాకుల పిటిషన్‌పై మార్చి 20లోగా నిర్ణయం తీసుకోవాలని ఫ్యామిలీ కోర్టును బాంబే హైకోర్టు ఆదేశించింది. ధన శ్రీకి భరణం కింద రూ.4.75 కోట్లు ఇవ్వడానికి చాహల్ అంగీకరించినట్లు సమాచారం. అయితే, ఆ మొత్తంలో చాహల్ ఇప్పటివరకు 2.37 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. కూలింగ్ పీరియడ్ పిటిషన్‌ను తోసిపుచ్చినందున భరణం కింద చెల్లించాల్సిన మిగతా మొత్తాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోవడం లేదని పేర్కొంది.

# ఎలాంటి బేరాల్లేవు.. ఎంతిస్తారో చెప్పలేదు

## రిటెన్షన్‌పై శశాంక్ సింగ్





2024 ఐపీఎల్ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన శశాంక్ సింగ్ ఆటను ఎవరూ మరవలేరు. ఆ జట్టు రిటైన్ చేసుకున్న ఇద్దరు ఆటగాళ్లలో ఒక్కడిగా నిలిచాడంటే అతడి ఆటతీరు ఎంత గొప్పగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే.. గతంలో ఎప్పుడూ వేలం సమయంలో టెన్షన్ పడేవాడినని.. ఎవరైనా తీసుకుంటారో లేదో అని ఆందోళన చెందేవాడినని శశాంక్ తెలిపాడు.

ఈసారి మెగా వేలానికి ముందే తనను రిటైన్ చేసుకోవడంపై అతడు ఆనందం వ్యక్తం చేశాడు. అప్పుడు ఏం జరిగిందో వివరించాడు. "ఇది నాకు పెద్ద డీల్. దీపావళికి మూడు రోజుల ముందు అనుకుంటా. ఆ రోజు సాయంత్రం నాకు ఫోన్ కాల్ వచ్చింది. నిన్ను రిటైన్ చేసుకుంటున్నాం.. ఓ ఫామ్ పంపుతున్నాం.. సంతకం చేసి రేపటికల్లా పంపు అన్నారంతే. నేను దానిని నింపి పంపాను. ఈ డీల్ సజావుగా సాగింది. ఎలాంటి బేరాలు లేవు. అసలు ఎంత మొత్తం ఇస్తున్నారో కూడా అందులో ప్రస్తావన లేదు" అంటూ చెప్పుకొచ్చాడు శశాంక్. పంజాబ్ కింగ్స్ అతడిని రూ.5.5 కోట్లు పెట్టి అట్టిపెట్టుకున్న విషయం తెలిసిందే.

గతంలో చాలాసార్లు వేలంలో ఎన్నో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నట్లు శశాంక్ వెల్లడించాడు. "ఏ టీమ్ నన్ను తీసుకుంటుందో అని ఆందోళన చెందేవాడిని. నా కుటుంబం కూడా టెన్షన్ పడేది. వేలంలో తిరస్కరణకు గురయ్యేవాడిని. ఒకవేళ తీసుకున్నా.. తుది జట్టులో పెద్దగా అవకాశాలు వచ్చేవి కావు. ఇక పంజాబ్ కింగ్స్ జట్టులో చోటు గురించి కూడా టెన్షన్ పడ్డాను. కానీ.. నన్ను రిటైన్ చేసుకుంటున్నట్లు కాల్ రాగానే ఎంతో సంతోషపడ్డాను. ఎంతో రిలాక్స్‌డ్‌గా అనిపించింది" అని వివరించాడు.

ఇక బౌలింగ్ విషయంలోనూ తాను ఎంతో హార్డ్‌వర్క్ చేస్తానని చెప్పాడు ఈ ఆల్‌రౌండర్. "నేను వేసే రెండు ఓవర్లు జట్టుకు కీలకంగా మారే అవకాశం ఉంది. నా పరిమితులు, నా బలాలు ఏంటో నాకు తెలుసు. నేను మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్‌లాంటి బౌలర్‌నని ఎప్పుడూ చెప్పను. కానీ.. నేను నా 18 బంతులను సరిగ్గా సంధిస్తే.. మ్యాచ్‌లను గెలిపించగలను" అని తన బౌలింగ్‌పై ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశాడు. శశాంక్ సింగ్ గత సీజన్‌లో 164 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 354 పరుగులు చేశాడు.

### నాటకీయ పరిణామాల మధ్య జట్టులోకి వచ్చి..

అంతకుముందు జరిగిన వేలంలో శశాంక్ సింగ్ పంజాబ్ జట్టులోకి చాలా నాటకీయ పరిణామాల మధ్య వచ్చాడు. అతడిని ఎంపిక చేసుకునే సమయంలో వేలంలో గందరగోళ పరిస్థితుల చోటుచేసుకున్నాయి. మొదట ఆ జట్టు అతడిని వద్దనుకుంది. శశాంక్ సింగ్ పేరు వేలంలోకి రాగానే కనీస ధర రూ.20 లక్షలకు అతణ్ని పంజాబ్ కొనుగోలు చేసింది. కానీ ఆ తర్వాత తాము తీసుకోవాలనుకున్న శశాంక్ అతడు కాదని, మరొకరని చెప్పింది. దీంతో వేలంలో కాస్త గందరగోళ పరిస్థితి తలెత్తింది. అప్పటికే వ్యాఖ్యాత వేలాన్ని ముగించడంతో పంజాబ్ అంగీకరించక తప్పలేదు. అతడే ఆ తర్వాత జట్టులో కీలక ఆటగాడిగా రాణించి.. జట్టు రిటైన్ చేసుకునే స్థాయి వరకూ ఎదిగాడు.



# ఓటీటీ మలయాళ హారర్ మూవీ

ఓటీటీ మలయాళ హారర్ మూవీ క్రైమ్ థ్రిల్లర్ మర్డర్ మిస్టరీలపై మలయాళ దర్శకుల దృష్టి ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది.వారి కథన శైలి ప్రేక్షకులను వెంటనే ఆకర్షించగలదు. అందుకే ఈ తరహా చిత్రాలు వెబ్ సిరీస్‌లు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో మలయాళ హారర్ సినిమా ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతోంది.ఆ సినిమా పేరు 'హంట్'.ఈ చిత్రం ఆగస్టు 23న థియేటర్లలో విడుదలై మంచి స్పందన అందుకుంది.ఇప్పుడు హర్రర్ సినిమాలకు ఆసక్తి ఉన్నవారికి మరింత సౌలభ్యంగా ఉండేలా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకి రానుంది.మనోరమ మ్యాక్స్ ద్వారా ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రంలో ప్రముఖ నటి భావన ప్రధాన పాత్రలో కనిపించనుంది.అలాగే రెంజీ పణిక్కర్, అజ్మల్ అమీర్, చందూ నాథ్, అనూ మోహన్, అదితి రవి ఇతర ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమాకి కైలాస్ మీనన్ సంగీతాన్ని అందించారు.కథ విషయానికి వస్తే, కీర్తి (భావన) ఒక ఫోరెన్సిక్ డాక్టర్.ఓ హత్య కేసును పరిశీలించే బాధ్యత ఆమెకు దక్కుతుంది.అయితే విచారణలో భాగంగా ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూస్తాయి.హత్యకు గురైన వ్యక్తి డాక్టర్ సారా అని కీర్తికి తెలుస్తుంది.ఆ కేసును పరిశీలించేందుకు ముందుకెళ్తున్న కీర్తికి అనుకోని పరిణామాలు ఎదురవుతాయి. సారా ఎవరు ఆమెను ఎవరు హత్య చేశారు ఆమె ఆత్మ కీర్తికి ఏం చెప్పాలనుకుంటోంది అనే ఆసక్తికర ప్రశ్నలకు సమాధానం ఈ సినిమాలో దొరుకుతుంది.మిస్టరీ హారర్ సినిమాలను ఆస్వాదించే ప్రేక్షకులకు ఇది మంచి అనుభూతిని కలిగించే చిత్రం. థ్రిల్ సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్ సమపాళ్లలో మిళితమైన ఈ సినిమా, మలయాళ చిత్రసీమ హారర్ జానర్‌ను ఎంత విభిన్నంగా హ్యాండిల్ చేస్తుందో మరోసారి రుచి చూపనుంది.



# అందాల ఐశ్వర్యం

తాజాగా మరోసారి అందాల ఐశ్వర్యం అనిపించుకునే విధంగా విభిన్నమైన మోడ్రన్ ఔట్ ఫిట్‌తో ఆకట్టుకుంది. అందాల ఐశ్వర్యం తమిళ బ్యూటీ ఐశ్వర్య మీనన్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా అదృష్టం కలిసి రాలేదు. అయితే ఈ పదేళ్ల కాలంలో ఐశ్వర్య మీనన్ చాలానే ప్రయత్నాలు చేసింది. తమిళ్ చిత్రాలతో పాటు మలయాళం, తెలుగు సినిమాల్లోనూ నటించింది. తెలుగులో ఈమె నటించిన స్పై, భజే వాయు వేగమ్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. దాంతో తెలుగులో మళ్లీ ఆఫర్ల కోసం ఈమె వెయిట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మలయాళంలో ఒక సినిమాను చేస్తుంది. అంతే తప్ప ఆమె నుంచి మరే సినిమాలు కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఎంతో మంది స్టార్ హీరోయిన్స్‌తో పోల్చితే అందం విషయంలో, అభినయం విషయంలో ముందు ఉండే ఐశ్వర్య మీనన్ అదృష్టం కలిసి రాకపోవడంతో అంతగా ఆఫర్లు సొంతం చేసుకోలేక పోతుంది. ఆకట్టుకునే అందం ఉన్నా కూడా ఈమెకు ఇప్పటి వరకు బిగ్ కమర్షియల్ హిట్ పడలేదు. కనుక ఇంకా ఆఫర్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. ముందు ముందు అయినా ఈమెకు నటిగా వరుసగా ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి. నటిగా గుర్తింపు దక్కించుకోవడం ప్రయత్నాలు చేస్తున్న ఐశ్వర్య మీనన్ సోషల్ మీడియాలో మాత్రం స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. తన అందమైన ఫోటోల కారణంగా రెగ్యులర్‌గా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది.ఇన్‌స్టాగ్రామ్‌లో 3.2 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఐశ్వర్య మీనన్ రెగ్యులర్‌గా షేర్ చేసే అందమైన ఫోటోలు, వీడియోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఐశ్వర్యం అనిపించుకునే విధంగా విభిన్నమైన మోడ్రన్ ఔట్ ఫిట్‌తో ఆకట్టుకుంది. సింపుల్ అండ్ స్వీట్ లుక్‌తో పాటు ఆకట్టుకునే అందం తన సొంతం అన్నట్లుగా ముద్దుగుమ్మ సోషల్ మీడియా ద్వారా మెప్పించింది. ఇంతటి అందగత్తె అయినా అదృష్టం కలిసి రాకపోవడంతో ఆఫర్లు అంతగా రావడం లేదు అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఐశ్వర్య మీనన్ అందంకు తగ్గ ఆఫర్ల కోసం ఆమె మరింత కాలం వెయిట్ చేయాల్సిందే అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తెలుగులో ఈమె చేసిన స్పై సినిమాతో పాటు భజే వాయు వేగమ్ సినిమా నిరాశ పరిచింది. కనీసం ఒక్క సినిమా హిట్ అయినా ఈ అందమైన ముద్దుగుమ్మకు టాలీవుడ్‌లో కనీసం మూడు నాలుగు ఆఫర్లు వచ్చి ఉండేవి. కానీ అదృష్టం కలిసి రాక పోవడంతో ఐశ్వర్య మీనన్ ఇంకా ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఈమె అందం చూస్తే మరో పదేళ్ల పాటు ఇండస్ట్రీలో సందడి చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పదేళ్ల కాలంలో అయినా ఐశ్వర్య మీనన్ కి స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# హ్యాపీ బర్త్ డే నాన్న

## మంచు మనోజ్ పోస్టు



'హ్యాపీ బర్త్ డే నాన్న' అంటూ %ాొ% మంచు మనోజ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. నేడు సినీనటుడు మోహన్ బాబు పుట్టినరోజును పురస్కరించుకొని %ాొ% మనోజ్ పోస్టు పెడుతూ %ాొ% " హ్యాపీ బర్త్‌డే నాన్న.. మనమంతా కలిసి వేడుకలను చేసుకునే ఈరోజు మీ పక్కన ఉండే అవకాశాన్ని కోల్పోయాం. మీతో కలిసి ఉండే క్షణాల కోసం ఎదురుచూస్తున్నా. లవ్ యూ" అని పేర్కొన్నారు. మరోవైపు మంచు లక్ష్మి కూడా తండ్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. "హ్యాపీ బర్త్‌డే నాన్న.. మీరు ఆయురారోగ్యాలతో, సంతోషం, ప్రశాంతంగా జీవించాలని ఆ దేవుడిని ఎల్లప్పుడూ ప్రార్థిస్తుంటా" అని పేర్కొన్నారు.

# టాయిలెట్ - ఏక్ ప్రేమ్‌కథ చిత్రం పై జయాబచ్చన్ కామెంట్స్ వైరల్!




టాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ భార్య, ఎంపీ జయా బచ్చన్ గురించి కొత్తగా పరిచయాలు అవసరం లేదు. హిందీ సినీ రంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆమె, ఉత్తరాది ప్రేక్షకులకు సుపరిచితమే కాకుండా, అవార్డ్స్ ఫంక్షన్లు, రాజకీయ వేదికల ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా తెలిసిన పేరు. ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిత్వం కలిగిన జయా బచ్చన్, తన అభిప్రాయాలను ఎలాంటి మొహమాటం లేకుండా బయటపెట్టడం విశేషం.తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న జయా బచ్చన్, ఓ బాలీవుడ్ స్టార్ హీరో నటించిన సినిమా గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. "ఛీ ఛీ.. అదేం పేరు! నిజంగా అది కూడా ఒక పేరేనా?" అంటూ ఆమె కామెంట్ చేశారు. బాక్సాఫీస్ వద్ద భారీ హిట్ అయినా, తన దృష్టిలో ఆ సినిమా మాత్రం ఫ్లాప్ అని చెప్పారు. బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ నటించిన 'టాయిలెట్ %-% ఏక్ ప్రేమ్‌కథ' చిత్రం. శ్రీ నారాయణ్ సింగ్ దీనికి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భూమి ఫడ్నేకర్ హీరోయిన్ గా నటించింది. 2017లో రిలీజ్ అయిన ఈ మూవీ దాదాపు 300 కోట్లు కలెక్షన్స్ రాబట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని మరుగుదొడ్ల సమస్యను ప్రస్తావిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య కోరిక మేరకు గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించడానికి ఓ భర్త ఏం చేశాడు ? అనేది ఈ సినిమా స్టోరీ.

**టైటిల్ నచ్చకపోతే సినిమా చూడను!**

నా దృష్టిలో మాత్రం ఫ్లాప్ మూవీనే అని జయా బచ్చన్ కామెంట్స్ చేశారు. అయితే అందుకు గల కారణాన్ని సైతం బయటపెట్టారు జయాబచ్చన్. తనకు సినిమాలు చూసే విషయంలో ఒక కండిషన్ ఉంటుందని తెలిపారు.ఆ నియమం కారణంగానే ఆ చిత్రం చూడలేదని చెప్పారు. సినిమాలు చూసే విషయంలో తాను కొన్ని కండీషన్స్ పెట్టుకున్నానని స్పష్టం చేశారు. టైటిల్ నచ్చకపోతే సినిమా చూడనని తేల్చి చెప్పారు. ఒక్కసారి ఆ టైటిల్ చూడండి,అలాంటి పేరు ఉన్న సినిమాలు చూడాలని నేను ఎప్పుడూ అనుకోను అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అందుకే అది బ్లాక్ బస్టర్ మూవీ అయినాబాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు కొల్లగొట్టినా కానీఆ చిత్రం అంటే తనకు నచ్చదని మొహమాటం లేకుండా చెప్పేశారు. తన దృష్టిలో అదొక ఫ్లాప్ చిత్రమని అన్నారు.

# సునీత రాకపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు


మెగాస్టార్ చిరంజీవి, అంతరిక్షయాత్రికులు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమికి చేరిన నేపథ్యంలో వారికి హృదయపూర్వక స్వాగతం తెలిపారు. తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో స్పందించిన చిరంజీవి, "మీరు 8 రోజుల్లో తిరిగి వస్తామని వెళ్లి 286 రోజుల అనంతరం భూమికి చేరుకున్నారు. ఇది నిజంగా చారిత్రక ఘట్టం. భూమి చుట్టూ 4,577 సార్లు తిరిగి గొప్ప విజయం సాధించారు" అని ప్రశంసించారు. సునీతా ప్రయాణం నిజమైన బ్లాక్ బస్టర్‌లా అనిపిస్తోందని, ఇది గొప్ప సాహసయాత్ర అని పేర్కొన్నారు. అంతరిక్షంలో పలు సవాళ్లు ఎదుర్కొని విజయవంతంగా భూమికి చేరడం ప్రేరణాత్మకమని, వీరి ప్రయాణం భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని చిరు అభిప్రాయపడ్డారు. మెగాస్టార్ చిరంజీవి సునీతా విలియమ్స్ ప్రయాణాన్ని ఒక అద్భుతమైన అడ్వెంచర్ మూవీగా అభివర్ణించారు. ఇది నిజమైన సాహసయాత్ర అని, అంతరిక్షంలో అనేక ఒడిదుడుకులను, శారీరకంగా, మానసికంగా ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా సమర్థంగా ఎదుర్కొని భూమికి తిరిగి చేరడం గొప్ప ఘనత అన్నారు. 286 రోజుల పాటు అంతరిక్షంలో ఉన్న ఆమె భూమి చుట్టూ 4,577 సార్లు తిరిగిందని, ఇది చారిత్రక ఘట్టమని చిరంజీవి పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ ధైర్యసాహసాలు ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉన్నాయని, ఆమె నిజమైన బ్లాక్ బస్టర్ సాహసయోధురాలు అని మెగాస్టార్ కొనియాడారు. ఆమె ప్రయాణం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని చిరు హర్షం వ్యక్తం చేశారు.



సాహసమే ఆమె ప్రాణధర్మం మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ, సునీతా విలియమ్స్ అప్రతిమ ధైర్యసాహసాలతో అంతరిక్షంలో 9 నెలలు గడిపి తిరిగి వచ్చారని కొనియాడారు. "మీరు గొప్ప ధైర్యవంతులు. మీకు ఎవరూ సాటిరారు" అని చిరు ప్రశంసించారు. అంతరిక్షంలో పరిశోధనలు, ప్రయోగాలు చేయడమే కాకుండా భూమికి తిరిగి రావడం ఎంతో సాహసోపేతమైన అంశం. సునీతా విలియమ్స్ ప్రయాణాన్ని చిరంజీవి నిజమైన బ్లాక్ బస్టర్‌గా అభివర్ణించారు. "ఇదొక అద్భుతమైన విజయం. నిజమైన సాహసగాథ. సునీతా విలియమ్స్ యొక్క ప్రయాణం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. అంతరిక్ష ప్రయాణం కేవలం శాస్త్రీయ ప్రయోగం మాత్రమే కాదు, అది మానవుని పట్టుదల, కృషి, నిబద్ధతకు నిదర్శనం.

# జారిపోనివ్వకండి..

## జీవితంపై కృతి ఫిలాసఫీ



పవన్ కళ్యాణ్ సరసన తీన్ మార్, సుమంత్ సరసన బోణి చిత్రాల్లో నటించింది కృతి కర్భంద. చివరిగా చరణ్ %-%బ్రూస్ లీ%-% చిత్రంలో సిస్టర్ పాత్రలో నటించింది. కానీ కృతికి హిందీలో అవకాశాలు రావడానికి కలిసొచ్చింది. మల్టీస్టారర్ హౌస్ ఫుల్ 4 -పాగల్ పానీ.. చెహ్రే లాంటి భారీ చిత్రాల్లో నటించింది. తమిళంలో %-%వాన్%-% అనే చిత్రంలోనూ నాయికగా నటించింది. తానిష్ - 14 పేరే లాంటి చిత్రాలలో చివరిగా నటించింది. ఇప్పుడు నటిగా తన కెరీర్ దాదాపు ముగిసింది.

మరోవైపు తన ప్రియుడిని పెళ్లాడి హ్యాపీ లైఫ్ లోకి అడుగు పెట్టింది. కృతి కర్బందా సహనటుడు పుల్కిత్ సామ్రాట్ తో డేటింగ్ చేసింది. వీరే కి వెడ్డింగ్- పాగల్‌పంతి -తాయిష్ చిత్రాలలో పుల్కిత్ కృతికి సహనటుడు. ఈ జంట 2019 నుండి రిలేషన్ షిప్ లో ఉన్నారు. తర్వాత పెళ్లి వేడుక నుంచి ఫోటోలు వైరల్ అయ్యాయి.

మరోవైపు కృతి రెడ్ హాట్ బికినీలో ఎంతో జోష్ ఫుల్ గా కనిపించిన ఫోటోలు అంతర్జాలంలోకి వచ్చాయి. చేతి వేళ్లలోంచి జారిపోతున్న ఇసుకను చూపిస్తూ ఇలా జారిపోనివ్వకండి అని రాసింది. ఇన్ స్టాలో ఈ ఫోటోషఉట్ తో పాటు అందమైన క్యాప్షన్ ఇచ్చింది. సోమవారం మంత్రం జపించి సూర్యుడిని తరించండి.. ఇసుక మీ వేళ్లలోంచి జారిపోనివ్వండి. ఎల్లప్పుడూ మీ గురించి బెస్ట్ విషయాలు తెలిసిన వ్యక్తిని వివాహం చేసుకోండి అని కూడా సందేశం ఇచ్చింది. కృతి కెరీర్ పరంగా చాలా విషయవంతమైన చిత్రాల్లో నటిస్తోంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A. RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A. RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339